- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
16-07-2026

సంపుటి : 01 సంచిక :114 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 114 NAMASTEY MAHAAPRABHA

## సీఎం రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ



- షాబాద్ ఘటనపై పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ
- బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

3 లో

## విరుచుకుపడ్డ అమెరికా!



- ఇరాన్ మిలిటరీ ఫెసిలిటీలు, తూంబ్ దీవిపై భీకర దాడులు
- కొన్ని గంటలపాటు ఏకబిగిన అటాక్.. నిన్న ఉదయం కూడా కొనసాగింపు
- ఇటీవలి దాడుల్లో 35 మంది మృతి.. 300 మందికి గాయాలు
- హోర్ముజ్ నుంచి గల్ఫ్ ఎగుమతులు బంద్: ఇరాన్

3 లో



## నేటి నుంచి బోనాల మహోత్సవం

- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ఆరంభం..
- ఆగస్టు 13 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు
- రూ.20 కోట్లతో ఘన ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం..
- 3 వేలకుపైగా దేవాలయాల్లో వైభవంగా నిర్వహణ
- అమ్మవారి కరుణతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ జూలై 15,(మహాప్రభ)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల మహోత్సవాలు గురువారం (జూలై 16) నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఆగస్టు 13న హరిబోలోని అక్కన్న--మాదన్న మహంకాళి ఆలయంలో బోనాల సమర్పణ, ఘటాల నిమజ్జనంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా శతాబ్దాల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యత,

-మిగతా 3లో

# విద్యారంగ ప్రక్షాళనే ధ్యేయం

### అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు: సీఎం రేవంత్‌రెడ్డి

- గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్వీర్యమైన విద్యావ్యవస్థ
- విద్యార్థుల భవిష్యత్తుకు నాది హామీ
- ఆగస్టు నుంచి 9 వస్తువుల పంపిణీ గ్యారంటీ
- క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వ చేయూత
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో విద్యా ప్రమాణాల పెంపు
- కొత్తకోటలో పాఠశాల భవనాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి


తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని, విద్యారంగ ప్రక్షాళనతో ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆగస్టు నుంచి 25.5 లక్షల మంది విద్యార్థులకు తొమ్మిది వస్తువులను గ్యారంటీగా అందజేస్తామని హామీ ఇస్తూ, విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల సంక్షేమం, క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."

మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి జూలై 15,(మహాప్రభ)

'తరగతి గదిలోనే నిజమైన తెలంగాణ నిర్మాణం జరుగుతుంది. అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందలేదు. అందుకే విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నా. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రాన్ని చదువులో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని

-మిగతా 3లో





## పార్లమెంట్‌లో 'స్మార్ట్' పరికరాలు వాడొద్దు

- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం సూచన

3 లో




3 లో

## 100 శాతం పెట్రోలే కావాలంటే.. ఎక్కువ ధర చెల్లించాల్సిందే

- వాహనదారులకు స్పష్టం చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



## యూరియాపై కేంద్రం గురి!

- దేశీయంగా మరో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి టార్గెట్
- రూ.62,500 కోట్ల మొబైల్ పీఎల్ఐ 2.0కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ. 1.27 లక్షల కోట్లతో సెమీకండక్టర్ మిషన్ 2.0 కూడా

3



## పీవోకేలో భగ్గుమన్న నిరసన జ్వాలలు

- పాక్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భారీ లాంగ్ మార్చ్
- రావల్ కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు నిరసనకారుల కదం
- గడువు ముగియడంతో తీవ్రతరం కానున్న ఆందోళనలు
- 38 డిమాండ్ల సాధనకై జేఏఏసీ పిలుపు

3 లో

## 'టీఆర్ఎస్' పేరు పెట్టుకుంటామంటే ఒప్పుకోం

### 2027లో పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్తా



- అధికారం కోల్పోవడంలో మా తప్పులు ఉన్నాయి
- వచ్చే ఎన్నికల్లోపు అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ
- తెలంగాణలో బీజేపీకి డిపాజిట్ కూడా దక్కదు : కేటీఆర్

న్యూఢిల్లీ జూలై 15,(మహాప్రభ)

ఎవరైనా 'టీఆర్ఎస్' పార్టీ పేరు పెట్టుకుంటామంటే బీఆర్ఎస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఖచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు అన్నారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘానికి అభ్యంతరాలు తెలిపి ఉండవచ్చన్నారు. తానైనా, ఇంకెవరైనా పార్టీ కంటే పెద్ద కాదని, పార్టీయే సుప్రీం అని తెలిపారు. బుధవారం ఎంపీ వద్ది రాజు నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీఆర్ఎస్ అంటే 22 ఏండ్ల ఒక ప్రస్థానం. అలాంటి పేరును వేరే ఎవరైనా సొంతం చేసుకోవాలంటే...

-మిగతా 3లో




## ఇస్రోలో వరుస రాజీనామాలు

- పెద్ద సంఖ్యలో సంస్థను వీడుతున్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు
- రాజీనామాల ఆమోదంపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు

న్యూఢిల్లీ జూలై 15,(మహాప్రభ)

: భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో)లో ఇటీవల స్వచ్ఛంద పదవీ విరమణలు, రాజీనామాలు పెరిగిపోతున్నాయి. సైంటిస్టులు, ఇంజినీర్లు పెద్ద సంఖ్యలో తమ పదవులను వదులుకోడానికి సిద్ధం అవుతున్నారు. దీంతో ఇప్పటికే ఇస్రో చేపట్టిన గగన్‌యాన్, చంద్రయాన్ ప్రాజెక్టులతో పాటు ఇతర కీలక మిషన్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్, ఇతర కీలక మిషన్లు లేదా ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు గ్రూప్-ఎలోని శాస్త్రీయ, సాంకేతిక సిబ్బంది నుంచి ఎలాంటి పదవీ విరమణ లేదా స్వచ్ఛంద

-మిగతా 3లో



## బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

- ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అధికారులు నిరంతరం సందర్శించాలి
- నాసిరకం సరుకులు సరఫరా చేసే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతాం
- ఒక్క బాల్య వివాహం కూడా జరగద్దు... బాల్య వివాహ రహిత తెలంగాణగా నిలవాలి
- ఉత్తమ సేవలందించే అంగన్‌వాడీ సిబ్బందికి ఆగస్టు 15న సన్మానం
- వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం
- మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క

హైదరాబాద్ జూలై 15,(మహాప్రభ)

బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది అని, చిన్న పిల్లలకు నాణ్యమైన పోషకాహారం, విద్య, సంరక్షణ అందిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. పిల్లలకు వసతులు అందించడం ఒక మెట్టు మాత్రమేనని... వారు అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం, ఆరోగ్యంగా, హుషారుగా ఎదగడం, వారి మేధాశక్తి పెరగడం అసలైన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న

-మిగతా 3లో

# వైద్య విద్యార్థులకు శుభవార్త..

**న్యూఢిల్లీ జూలై 15,(మహాప్రభ)**
వైద్య విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు ఇది శుభవార్తే. దేశవ్యాప్తంగా ఎంబీబీఎస్ సీట్ల(వీదీదీూ ూమఝం) సంఖ్య పెరిగింది. 2025తో పోలిస్తే ఈ యేడాది సుమారు 7 శాతం సీట్లు పెరిగినట్లు తెలుస్తోంది. దేశంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1.36 లక్షలకు చేరుకున్నది. గత ఏడాది దేశవ్యాప్తంగా 1,28,976 ఎంబీబీఎస్ సీట్లు ఉండేవి. 2025-26 వార్షిక సంవత్సరానికి 818 మెడికల్ కాలేజీల్లో ఆ సంఖ్య ఉండేది. ఇక కొత్త వార్షిక సంవత్సరం 2026-27 సీజన్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 823 కాలేజీల్లో 136939 మెడికల్ సీట్లు ఉన్నట్లు తెలిసింది. దీంట్లో 441 ప్రభుత్వ, 382 ప్రైవేటు కాలేజీలు ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎంబీబీఎస్ సీట్లలో



1,27,028 సీట్లు రెన్యువల్ సిస్టమ్ ద్వారా రాగా, ఇక కొత్తగా మరో 9911 సీట్లు జత కలిసినట్లు తెలిసింది.ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 63,296 సీట్లు ఉండనున్నాయి. దీంట్లో 61,185 సీట్లు రెన్యువల్ కాగా, 2111 సీట్లు కొత్తవి. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 73,643 సీట్లు ఉండనున్నాయి. దీంట్లో 65,843 సీట్లు రెన్యువల్ కాగా, 7800 కొత్త సీట్లు ఉంటాయి. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ఈ కొత్త వివరాలను వెల్లడించింది. 2026-27 వార్షిక విద్యా సంవత్సరం కోసం ఎన్ఎంసీ ఈ వివరాలను ప్రకటించింది. ఎయిమ్స్, జిప్‌మర్ పుదుచ్చేరి, పీజీఐ చండీఘడ్ లాంటి విద్యాసంస్థలను ఈ జాబితాను నుంచి మినహాయించారు. కౌన్సిల్ ప్రక్రియకు ముందు మెడికల్ కౌన్సిల్ కీలక సమాచారాన్ని చేరవేసింది. అయితే కేంద్ర వైద్య విద్యా సంస్థల్లో ప్రతి ఏడాది సుమారు 2900 సీట్లకు కౌన్సిలింగ్ చేస్తుంటారు. అయితే ఎన్ఎంసీ డేటా ప్రకారం ఈ ఏడాది కొత్తగా మొత్తం 7963 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉండనున్నట్లు తెలిసింది.

# గో రక్షణ పథకంలో రూ.57 కోట్ల స్కామ్

**జైపూర్: జూలై 15,(మహాప్రభ)**
గో రక్షణ పథకంలో భారీగా అవినీతి జరిగినట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గుర్తించింది. సబ్సిడీల కోసం చనిపోయిన ఆవులతో పాటు గోశాలలో లేని గోవులను కూడా నమోదు చేసి రూ.57 కోట్ల మేర నిధులు కొల్లగొట్టినట్లు నివేదికలో ఆరోపించింది. (ణముుఃస ఎశీఽం శ్రీఅర్వఃస టశీతీ స్త్రతీఖుతీం) బీజేపీ పాలిత రాజస్థాన్‌లో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. గో రక్షణ పథకం కింద గోశాలలోని ఒక ఆవుకు రోజుకు రూ. 40, దూడకు రోజుకు రూ.20 చొప్పున పశుగ్రాసం, తాగు నీరు కోసం నిర్వాహకులకు చెల్లిస్తారు. అయితే పలు గోశాలల నిర్వాహకులు తప్పుడు లెక్కలు, చనిపోయిన ఆవులను కూడా నమోదు చేసి లబ్ధిపొందినట్లు కాగ్ ఆడిట్ పరిశీలనలో తేలింది.కాగా, రాజస్థాన్‌లోని 38 గోశాలలు వాస్తవ సంఖ్య కంటే సుమారు 1.31 లక్షల పశువులను అదనంగా చూపించాయి. దీనివల్ల రూ.



57.36 కోట్ల అదనపు గ్రాంట్లు విడుదలయ్యాయి. గోశాలలు నిర్వహించే రోజువారీ పశువుల రికార్డులకు, 'భారత్ పశుధన్ యాప్'లోని సమాచారం మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు ఆడిట్‌లో తేలింది. ఈ వ్యత్యాసాలు ఉన్నప్పటికీ, సరైన ధృవీకరణ లేకుండానే నిధులు మంజూరు చేసినట్లు బయటపడింది. మరోవైపు జైపూర్‌తో సహా అనేక ప్రముఖ గోశాలల్లో ఇలాంటి అక్రమాలు జరిగినట్లు కాగ్ గుర్తించింది. పింజ్రాపోల్ గోశాలకు సుమారు రూ. 1.81 కోట్లు, హింగోనియా గోశాలకు రూ. 1.41 కోట్ల అదనపు నిధులు విడుదలైనట్లు ఆరోపించింది. డీగ్ జిల్లాలోని 'శ్రీ బ్రజ్ కామద్ సురభి వన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ గోశాల'కు అత్యధికంగా రూ.16.36 కోట్ల అదనపు నిధులు, జలోర్ జిల్లా పాత్‌మేడాలోని 'శ్రీ గోపాల్ గోవర్ధన్ గోశాల'కు రూ. 10.95 కోట్ల అదనపు గ్రాంట్లు విడుదలైనట్లు కాగ్ నివేదికలో బయటపడింది. కాగా, కాగ్ ఆడిట్ నివేదికపై గోపాలన్ శాఖ అధికారులు స్పందించారు. 38 గోశాలల నుంచి రూ. 57.36 కోట్లను తిరిగి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ ఏడాది మే 29 నుంచి సంబంధిత గోశాలలకు నోటీసులు జారీ చేశారు. అయితే గోశాలల నిర్వాహకులు ఈ ఆరోపణలను ఖండించారు. అదనంగా పొందిన నిధులు తిరిగి చెల్లించేందుకు ముందుకు రావడం లేదు.

# వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి విషమం

**-కేంద్రంతో చర్చలేకుండా దీక్ష విరవించను..**
**-నేడు సామూహిక నిరాహార దీక్ష**

**న్యూఢిల్లీ బ్యూరోజూలై 15,(మహాప్రభ)**
నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ అవకతవకలు వంటి విద్యా రంగ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత 18 రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పరిస్థితి చాలా విషమంగా ఉంది. వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ, ఆందోళనలో లేవనెత్తిన డిమాండ్లను పట్టించుకునేందుకు ముందుకు రాకుండా కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణిని ప్రదర్శిస్తుంది. ప్రతిపక్ష నాయకులు, ప్రముఖులు, విద్యావేత్తలు , 1,800 మందికి పైగా పౌరుల విజ్ఞప్తులను పక్కనపెట్టి, ప్రభుత్వం చర్చలు జరపాలని కోరుతూ వాంగ్‌చుక్ తన దీక్షను విరమించడానికి




నిరాకరించారు. ఆయన మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ చాలా బలహీనంగా ఉన్నారని, ఆయనను ప్రతిక్షణం పర్యవేక్షిస్తున్నామని వైద్య బృందం తెలిపింది. వాంగ్‌చుక్‌కు సంఘీభావంగా, సీజేపీ గురువారం సామూహిక నిరాహార దీక్షను ప్రకటించింది. ఎస్ఎఫ్ఐ కూడా గురువారం నిరాహార దీక్ష చేపడతామని ప్రకటించింది. దీక్ష ప్రారంభించి నప్పటి నుంచి వాంగ్‌చుక్ బరువు సుమారు తొమ్మిది కిలోలు తగ్గింది. వాంగ్‌చుక్‌తో కలిసి నిరాహార దీక్ష ప్రారంభించిన కొందరు విద్యార్థి నేతలను ఆసుపత్రికి తరలించారు. జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న శాంతియుత ఆందోళనను భగ్నం చేయడానికి సంఘ్ పరివార్ పలు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఆందోళనను దేశద్రోహంగా చిత్రీకరించేందుకు సంఘ్‌పరివార్ గూండాలను జంతర్ మంతర్‌కు పంపుతున్నారని సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంగ అన్నారు. 25వ రోజు కొనసాగిన ఈ ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు రాజకీయ, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు బుధవారం జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. స్టాండప్ హాస్యనటుడు, రాజకీయ వ్యంగ్య రచయిత కునాల్ కమ్రా, కాంగ్రెస్ ఎంపీ ప్రశాంత్ పడోలే, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ బహిరంగ లేఖ రాశారు.

# రూ.1.28 కోట్లతో సెమీకాన్ 2.0

**కేంద్ర మంత్రివర్గం ఆమోదం**

**న్యూఢిల్లీ జూలై 15,(మహాప్రభ)**
రూ.1,28 కోట్లతో సెమీకాన్ 2.0కు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం నాడిక్క ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మొత్తం రూ.2.19 కోట్ల విలువైన ఏడు ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశాన్ని సెమీకండక్టర్ల తయారీలో గ్లోబల్ హబ్‌గా మార్చడం, మొబైల్ ఉత్పాదనను పెంచడం, ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి సాధించడంతో పాటు వారణాసిలో ప్రతిష్ఠాత్మక ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దేశాన్ని అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం 'సెమీకండక్టర్ మిషన్ 2.0'ను ప్రకటించింది. దీని కోసం ఏకంగా రూ.1,27,500 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ నిర్ణయంతో దేశంలో అత్యాధునిక



సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు, డిజైనింగ్, ప్యాకేజింగ్ పరిశ్రమలకు భారీగా ప్రోత్సాహం లభించనుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సాధిస్తున్న దూకుడును మరింత పెంచేందుకు రూ.62,500 కోట్ల కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్స్ (ఎంపీఎంఎస్)కు ఆమోదం తెలిపింది.ఈ పథకంతో స్థానిక మొబైల్ ఉత్పత్తి పెరగడమే కాకుండా, భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఎరువుల రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధి దేశంగా మార్చేందుకు, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా-2026'కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో దేశీయంగా యూరియా ఉత్పత్తిని పెంచి రైతులకు కొరత లేకుండా చేయనున్నారు. దీనికి ప్రత్యేకంగా ఆర్థిక కేటాయింపులు కాకుండా విధానపరమైన ఆమోదం తెలిపారు. వారణాసి రూపురేఖలను మార్చేలా రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. వరుణా నది ఎలివేటెడ్ కారిడార్: రూ.10,998 కోట్ల వ్యయంతో వరుణా నది వెంబడి 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. గంగా నది ఎలివేటెడ్ కారిడార్: రూ.14,448 కోట్ల వ్యయంతో గంగా నది వెంబడి 6 లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్‌ను చేపట్టనున్నారు.దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు రెండు రైల్వే లైన్ల ప్రాజెక్టులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పారాదీప్-హరిదాస్‌పూర్ రైల్వే లైన్: రూ.2,542 కోట్ల అంచనా వ్యయంతో ఈ రైల్వే లైన్ డబ్లింగ్ (రెండో లైన్) పనులను చేపడతారు. డాంగోవాపోసి-రాజ్‌ఖర్సవాన్ నాలుగో లైన్: రూ.1,365 కోట్ల పెట్టుబడితో ఈ మార్గంలో నాల్గవ రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

# మమతకు మరో షాక్..

**-టీఎంసీ రెబల్స్ వర్గంలోకి మరో ఎమ్ఎల్ఏ**

**కోల్‌కతా జూలై 15,(మహాప్రభ)**
తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరోషాక్ తగిలింది. సీనియర్ నేత మదన్ మిత్రా బుధవారం అసెంబ్లీలో విపక్ష నేత రితబ్రా బెనర్జీ నేతృత్వం లోని రెబెల్ వర్గంలో చేరారు. తాను టీఎంసీలోనే ఉన్నానని, టీఎంసీ లోనే కొనసాగుతానని మదన్ మిత్రా వెల్లడించారు. పశ్చిమబెంగాల్ నార్త్ 24 పరగనాస్



జిల్లాలో ఉన్న కామర్‌హాతి సీటు నుంచి ఎమ్ఎల్ఏగా గెలుపొందిన తాను మమతా బెనర్జీ అనుసంధాన కాలిఘాట్ టిఎంసీ అజమాయిషీలో ఉన్న అన్ని జాతీయ, రాష్ట్ర సంస్థాగత కమిటీల పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. అసెంబ్లీ లోని పార్టీ చీఫ్ విప్ పదవిని కూడా ఆయన వదులుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ తాను ఇంటిని విడిచిపెట్టలేదని, గదిని మాత్రమే మార్చానని , తాను టిఎంసీ లోనే ఉంటానని పేర్కొన్నారు.

# దేశంలో మళ్లీ పెరుగుతున్న కొవిడ్ కేసులు..

**-ఈ లక్షణాలుంటే లైట్ తీసుకోవద్దంటున్న వైద్యులు..!**



**జూలై 15,(మహాప్రభ)**
దేశంలో కొవిడ్-19 కేసులు మరోసారి నెమ్మదిగా చాపకింద నీరులా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణంలో మార్పులవల్ల వచ్చే సాధారణ జ్వరాలుగా భావించి చాలామంది కోవిడ్ లక్షణాల ను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యంవల్ల వైరస్ వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏ చిన్న అనుమానాస్పద లక్షణం కనిపించినా స్వీయ వైద్యం చేసుకోకుండా, వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.ప్రస్తుతం నమోదవుతున్న కొవిడ్ కేసులలో ప్రధానంగా జ్వరం, నిరంతరాయంగా వచ్చే పొడి దగ్గు, తీవ్రమైన ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయని వైద్యులు తెలిపారు. వీటితోపాటు విపరీతమైన అలసట, గొంతు నొప్పి, వాసన లేదా రుచి కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఐసోలేషన్‌లో ఉండాలని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, శ్వాసకోశ సమస్యలు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పండుగలు, జాతరలు రద్దీగా ఉండే ప్రాంతాలకు వెళ్లేటప్పుడు కచ్చితంగా మాస్కులు ధరించాలని, శానిటైజర్ వాడకం, భౌతిక దూరం పాటించడం వంటి ముందస్తు జాగ్రత్తలను మళ్లీ అలవాటు చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# సర్‌లో పాల్గొన్న సిబ్బందికి 6 వేల గౌరవ వేతనం



**న్యూఢిల్లీ జూలై 15,(మహాప్రభ)**
కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్, హర్యానా, చండీఘడ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ జరుగుతోంది. అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివరాలు సేకరిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్వోలు), బూత్ లెవల్ సూపర్‌వైజర్లు(బీఎల్ఎస్)కు గౌరవ వేతనంగా 6 వేలు ఇవ్వాలని కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. మంగవారం రాత్రి ఆ ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలోనూ సర్ ప్రక్రియ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.తమ విధులకు ఇచ్చే జీతంతో పాటు ఒక్కసారి మాత్రమే అదనంగా 6వేల గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ఫ్రదేశ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయూ, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్నాటక, మణిపూర్, మేఘాలయా, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం సర్ ప్రక్రియ చేపట్టారు. అయితే ఓటర్ల వివరాలను సేకరిస్తున్న బూత్ లెవల్ అధికారులకు ఈ ప్రక్రియ వల్ల లబ్ధి చేకూరనున్నది.


# రూ.420 కోట్లు పలికిన డైనోసార్ అస్థిపంజరం



**న్యూయార్క్ జూలై 15,(మహాప్రభ)**
అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగిన 'సోత్‌బీస్' వేలం కేంద్రంలో 'గస్' అనే టైరన్నో సారస్ రెక్స్ డైనోసార్ అస్థిపంజరం ఏకంగా 50.01 లక్షల డాలర్లు(సుమారు రూ.420 కోట్లు)కు అమ్ముడయ్యింది. 10 నిమిషాల పాటు ఏడుగురు బిడ్డర్ల మధ్య జరిగిన వేలంలో ఈ డైనోసార్ శిలాజం రికార్డు స్థాయి ధర పలకడం విశేషం.183 శిలాజ ఎముకలతో కూడిన ఈ 'గస్' అస్థిపంజరం ప్రపంచంలోనే అత్యంత సంపూర్ణమైన టీ రెక్స్ శిలాజాలలో ఒకటి. ఇది సుమారు 63 శాతం వరకూ సంపూర్ణంగా ఉంది. ఈ డైనోసార్ శిలాజం 2021లో అమెరికాలోని సౌత్ డకోటాలోని ఒక పశువుల క్షేత్రంలో బయటపడింది. ఈ జీవి సుమారు 72 నుంచి 66 మిలియన్ ఏళ్ల క్రితం నివసించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

# 25% భరణం మార్గదర్శకం మాత్రమే..

**కచ్చితమైన నిబంధన కాదు**



**అలహాబాద్, జూలై 15,(మహాప్రభ)**
దంపతులు విడాకులు తీసుకొని విడిపోయిన అనంతరం భర్త ఆదాయంలో గరిష్ఠంగా 25 శాతం వరకు భార్యకు భరణంగా ఇవ్వాలని నిర్ణయించడం కేవలం మార్గదర్శకం మాత్రమేనని, దానిని తప్పనిసరి నిబంధనగా పరిగణించరాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టంచేసింది. ప్రతి కేసులోను వాస్తవాలను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని 25 శాతం కన్నా ఎక్కువగా లేదా తక్కువగా కూడా భరణాన్ని నిర్ణయించే విచక్షణ అధికారం కింది కోర్టులకు ఉంటుందని తెలిపింది.

# నేటి నుంచి బోనాల మహోత్సవం

మొదటి తరువాయి

భిన్న సంస్కృతుల సమ్మేళనానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే ఈ ఉత్సవాలు తెలంగాణ గంగా--జమున తహజీబ్‌కు ప్రతిరూపమని ఆమె అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో ఉన్న సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో పోలీస్, జీహెచ్ఎంసీ, వైద్య, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితర శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లు కేటాయించడం పట్ల మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయడంతో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను కనులపండుగగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు పూర్తిగా తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతన్నలు సుభిక్షంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి భక్తుడు సుఖశాంతులతో అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి సురక్షితంగా తిరిగి ఇళ్లకు చేరుకునేలా అన్ని శాఖలు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.

# విద్యారంగ ప్రక్షాళనే ధ్యేయం

మొదటి తరువాయి

విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. 'ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోంది. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరాలి. విద్యార్థులు మైదానాల్లోనూ పోటీ పడాలి. మీ భవిష్యత్తుకు నాదీ హామీ. క్రీడల్లో రాణించేవారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది. క్రీడాకారులు మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీనకు గ్రూప్-1 ఉద్యోగాలు ఇచ్చాం. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో ఏండ్లుగా ఉన్న సమస్యలకు పరిష్కారం చూపుతాం' అని రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. తెలంగాణ కోసం రాజకీయ నాయకులెవ్వరూ బలిదానాలు చేసుకోలేదని సీఎం తెలిపారు. ఉస్మానియా విద్యార్థి లోకం, తెలంగాణ విద్యార్థులంతా రోడ్లపైకి వచ్చి ఆందోళన బాట పట్టిన తర్వాతే బలిదానాలను చూసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాను లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాష్ట్రంలో పదేండ్లు పాలించిన పాలకులు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతులు లేక పేదలు సైతం ప్రభుత్వ పాఠశాలలను వదిలి ప్రయివేటుకు పంపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో రాష్ట్రంలో 28వేల ప్రభుత్వ పాఠశాలల్లో 18లక్షల మంది విద్యార్థులు ఉంటే 11వేల ప్రయివేటు పాఠశాలల్లో 33లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అందుకే విద్యారంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసే ఇంటిగ్రేటెడ్ తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయడంతో పాటు దశాబ్ద కాలం పాటు ఎదురుచూసిన బదిలీలు, పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయులకు సైతం న్యాయం చేశామన్నారు. గత పాలకుల మాదిరిగా కాకుండా బదిలీలు, పదోన్నతుల్లో ఎక్కడా విమర్శలు రాకుండా పారదర్శకంగా నిర్వహించామన్నారు. 33 జిల్లాలలో 18వ స్థానంలో ఉన్న పాలమూరును మొదటి స్థానంలో నిలబెడతామని తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న జర్మన్, జపాన్, బ్రిటిష్ భాషల్లో రాణించి ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ ఆగస్టు నుంచి 25 లక్షల 50వేల మంది విద్యార్థులకు తొమ్మిది వస్తువులను గ్యారంటీగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఐఐఎస్, ఐఐఎస్ వంటి ఉన్నత చదువులతో పాటు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు జిల్లాకు ట్రిపుల్ ఐటీ ఇంజినీరింగ్‌తో పాటు ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేశామన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, మేఘారెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ సరిత, నాయకులు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# యూరియాపై కేంద్రం గురి!

**దేశీయంగా మరో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి టార్గెట్**
**- రూ.62,500 కోట్ల మొబైల్ పీఎల్ఐ 2.0కు కేంద్ర కేబినెట్ ఆమోదం**
**- రూ. 1.27 లక్షల కోట్లతో సెమీకండక్టర్ మిషన్ 2.0 కూడా**



నేషనల్ బ్యూరో:
యూరియా ఉత్పత్తిలో దేశం స్వయంసమృద్ధి సాధించేందుకు, దిగుమతుల కోసం ఇతర దేశాలపై ఆధారపడటం పూర్తిగా తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తి అవుతున్న యూరియాకు అదనంగా మరో 10 మిలియన్ టన్నుల యూరియా ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా-2026 (ఎన్ఐపీయూ)'కు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ విధానానికి ఆమోదముద్ర వేశారు. ఈ నూతన విధానం ద్వారా దేశంలో కొత్తగా 8-9 గ్యాస్ ఆధారిత యూరియా ప్లాంట్లను స్థాపించనున్నారు. ఈ పాలసీతో కొత్తగా 8-9 కొత్త ప్లాంట్లు ఏర్పాటు అవుతాయని తెలిపారు. అయితే గత దశాబ్ద కాలంలో అదనంగా 6 కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేసామని, దీని వల్ల ఇప్పటికే యూరియా దిగుమతులపై ఆధారపడటం తగ్గిందని గుర్తుచేశారు. ప్రస్తుతం భారతదేశంలో యూరియా వార్షిక డిమాండ్ సుమారు 40 మిలియన్ టన్నులుగా ఉంది. అయితే ఇందులో దేశీయంగా దాదాపు 30 మిలియన్ టన్నులు ఉత్పత్తి అవుతోంది. మిగిలిన 10 మిలియన్ టన్నుల లోటును దిగుమతుల ద్వారా భర్తీ చేస్తున్నారు. తాజా నిర్ణయం వల్ల మిగిలిన 10 మిలియన్ టన్నులు కూడా దేశంలోనే ఉత్పత్తి కానుంది. న్యూ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీకి పొడిగింపుగా తీసుకువచ్చిన ఎన్ఐపీయూ-2026లో మూడు కీలక మార్పులు చేశారు. దీని వల్ల ప్రభుత్వ, ప్రైవేట్, సహకార ప్రాజెక్టులన్నింటికీ ఒకే రకమైన ప్రోత్సాహకాలు అందుతాయి. అలాగే, వారణాసిలో పర్యాటక రంగంలో వృద్ధి, ట్రాఫిక్ తగ్గింపు కోసం మొత్తం రూ. 25,445.96 కోట్లతో రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ. 3,907 కోట్ల అంచనా వ్యయంతో ఒడిశా, జార్ఖండ్‌లో 145 కిలోమీటర్ల మేర రెండు మళ్లీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# 'టీఆర్ఎస్' పేరు పెట్టుకుంటామంటే ఒప్పుకోం

మొదటి తరువాయి

పార్టీ అభిమానులు, కార్యకర్తలు ఖచ్చితంగా అభ్యంతరం తెలుపుతారు. 2022లో పార్టీ పేరు మార్చుకున్నాక... ఆరేండ్లు టీఆర్ఎస్ పేరును కేంద్ర ఎన్నికల సంఘం సీజ్ చేసింది. ఈ పేరు కావాలంటే ఎన్నికల సంఘం అభ్యంతరాలు కోరుతుంది. అందుకు మా వాళ్లు స్పందిస్తారు' అని కవిత పార్టీ పేరుకు సంబంధించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. తమ పార్టీ నుంచి విభేదించి కొందరు పోయారని, ఎవరి ఎజెండాలు, రాజకీయాలు వాళ్లవని అన్నారు. ఇష్టం లేక పార్టీ నుంచి పోయిన వాళ్ల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి100 శాతం మా తప్పులే కారణం

2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి 100 శాతం మా తప్పులే ఉన్నాయని కేటీఆర్ అంగీకరించారు. వాటిని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందనీ, సరిదిద్దుకుంటామని తెలిపారు. ప్రధానంగా కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలను ప్రజలను నమ్మారన్నారు. అయితే అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన పాలనను ప్రజలు ప్రస్తుతం గమనిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో కేవలం 1.8 శాతం ఓట్లు, దాదాపు 4 లక్షల ఓట్లతో తేడాతో తాము ఓడిపోయామన్నారు. అయితే 2018 తో పోల్చితే బీఆర్ఎస్ గ్రాఫ్ 10 శాతం తగ్గిందని ఒప్పుకున్నారు. తెలంగాణలో కుల రాజకీయాలకు తావు లేదని, ఆ పరిస్థితి ఎప్పటికీ రాదన్నారు. మళ్లీ ఎన్నికల సమయానికి ఏదో మ్యాజిక్ చేసి అధికారంలోకి వస్తామని రేవంత్ రెడ్డి అనుకుంటున్నారనీ, కానీ కాంగ్రెస్ కు ఓటమి తప్ప మరేమి మిగలదన్నారు.

బీజేపీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పరిస్థితే

15 ఏండ్ల మోడీ సుదీర్ఘ పాలనపై దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనే మోడీ నేతృత్వంలోని బీజేపి ఓడిపోయిందని, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సహకారంతో సంకీర్ణం ప్రభుత్వం నడుస్తోందన్నారు. ఇక రాష్ట్రం అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీకి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల పరిస్థితే వస్తుందని, కనీసం ఆపార్టీకి డిపాజిట్ సైతం దక్కదన్నారు. రాష్ట్రంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని చెప్పారు.

# ఇస్రోలో వరుస రాజీనామాలు

మొదటి తరువాయి

రాజీనామాల కోసం వచ్చే అభ్యర్థనలను అంగీకరించొద్దని ఇస్రో సెంటర్ డైరెక్టర్లు, యూనిట్ హెడ్‌లను కేంద్రం ఆదేశిస్తూ ఓ మెమో జారీ చేసింది. సైంటిస్టు లేదా ఇంజినీర్ ఎస్‌జీ ర్యాంకు సిబ్బంది నుంచి వచ్చే అభ్యర్థనలను ఇస్రో డైరెక్టర్లు కచ్చితమైన సిఫార్సులతో శాఖకు పంపొచ్చని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర అంతరిక్షశాఖ ఓ మెమోను జారీ చేసింది. ఇటీవల ఇస్రో సంస్థలో పెద్ద ఎత్తున రాజీనామాలు, స్వచ్ఛంద పదవీ విరమణ అభ్యర్థనలు వచ్చినట్టు కేంద్రం గుర్తించింది. ఇందులో చాలా మంది సీనియర్లు కూడా ఉన్నారు. వీరంతా పని విషయంలో వస్తున్న విభేదాలతో పాటు అంతర్గత విభేదాలతో రాజీనామాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో పాటు ఇండియాలోని ఓ ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన కేంద్రంలో మంచి అవకాశాలు వస్తుండటంతో అటువైపు వెళ్తున్నారనే ప్రచారం కూడా ఉంది.

# సీఎం రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ


**-షాబాద్ ఘటనపై పవన్ కల్యాణ్ లేఖ**
**-పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి**
**-పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం**
**-పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ**
**-బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ**



హైదరాబాద్
పోక్సో చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు చిన్నారులపై లైంగిక నేరాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నపమైన లేఖ రాశారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు పలు కీలక ప్రతిపాదనలను ఆయన లేఖలో పొందుపరిచారు. తెలంగాణలో జరిగిన షాబాద్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావించిన పవన్, బెయిల్‌పై విడుదలైన నిందితుడు ఆరుగురిని హత్య చేసిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. పోక్సో కేసుల్లో నిందితుల బెయిల్‌ను మరింత కఠినంగా పరిశీలించాలని, బాధితులు మరియు వారి కుటుంబాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. పోక్సో కేసులను దర్యాప్తు చేసే అధికారులకు తప్పనిసరిగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ అవసరమని పేర్కొన్నారు. బాధితుల వైద్య పరీక్షలను 24 గంటల్లో పూర్తి చేయాలని, సేఫ్ కిట్ల వినియోగంతో పాటు డీఎన్ఏ, ఎఫ్ఎస్ఎల్ నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు పవన్. ఘటన స్థలాన్ని ఫోటోలు, వీడియోలతో తప్పనిసరిగా నమోదు చేయాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఛార్జిషీట్ గడువులోగా పూర్తి కావాలని పవన్ పేర్కొన్నారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, క్లిష్టమైన కేసులను 90 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెలా సమీక్షించాలని సూచించారు. ప్రతి పోక్సో కేసులో బాధితుల రక్షణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా, ఎస్కార్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు వన్ స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని పవన్ ప్రతిపాదించారు. బెదిరింపులకు పాల్పడే లేదా నేర చరిత్ర ఉన్న నిందితులపై రౌడీషీట్లు తెరవాలని సూచించారు. పోక్సో కేసుల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకరూప స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) విడుదల చేయాలని, జిల్లా, రేంజ్, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు, ప్రాసిక్యూషన్, మహిళా-శిశు సంక్షేమ శాఖల మధ్య సంయుక్త సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కూడా సూచించారు. పోక్సో కేసుల్లో ప్రాథమిక విచారణ పేరుతో ఆలస్యం చేయకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఎఫ్ఐఆర్ నమోదు ఆలస్యం చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ లేఖలో పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, ప్రార్థనా మందిరాల్లో పిల్లలపై లైంగిక నేరాల నివారణకు తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాలను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యంతో చూడాలని పవన్ స్పష్టం చేశారు. తాను సూచించిన చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పోక్సో చట్టం సమర్థవంతమైన అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని, రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి వేగవంతమైన, ఖచ్చితమైన న్యాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.

# విరుచుకుపడ్డ అమెరికా!

**ఇరాన్ మిలిటరీ ఫెసిలిటీలు, తూంబ్ దీవిపై భీకర దాడులు**
**- కొన్ని గంటలపాటు ఏకబిగిన అటాక్.. నిన్న ఉదయం కూడా కొనసాగింపు**
**- ఇటీవలి దాడుల్లో 35 మంది మృతి.. 300 మందికి గాయాలు**
**- హోర్ముజ్ నుంచి గల్ఫ్ ఎగుమతులు బంద్: ఇరాన్**



నేషనల్ బ్యూరో:
అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ప్రజా ఆందోళనలు, అణ్వాయుధ తయారీ ఆందోళనలతో మొదలైంది. నేడు హోర్ముజ్ జలసంధి కేంద్రంగా దాడులు చేసుకుంటున్నాయి. యుద్ధంతో కొత్తగా ఈ జలసంధిపై ఆధిపత్యాన్ని దక్కించుకున్న ఇరాన్.. దాన్ని వదిలిపెట్టుకోవడానికి సిద్ధం లేదు. అమెరికా ఈ వైఖరిని సహించడలేదు. ఈ వైరంతోనే మ మొదలైన దాడులు.. నిన్న భీకర స్థాయికి చేరుకున్నాయి. మంగళవారం తెల్లవారుజామున కనీసం కొన్ని గంటలపాటు ఏకబిగిన అమెరికా విరుచుకుపడింది. ఇరాన్ తీర ప్రాంతంలోని మిలిటరీ ఫెసిలిటీలను ధ్వంసం చేసింది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిపై దాడికి ఉపయోగించుకునే ఫెసిలిటీలు, వ్యూహాత్మక ప్రాంతాలు, ఏర్పాట్లు అమెరికా లక్ష్యంగా చేసుకుంది. రాత్రీపూట కాకుండా బుధవారం ఉదయం పూట కూడా దాడులు కొనసాగింది. అమెరికా స్థానిక కాలమానం ప్రకారం నిన్న ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు దాడులతో మోతమోగించింది. ఇందుకు ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను లక్ష్యం చేసుకుంది. బహ్రెయిన్‌లోని ఐదో ఫ్లీట్ కమాండ్ సెంటర్‌ను ధ్వంసం చేసింది. కువైట్‌లోని మీనా అబ్దుల్లాలోని అమెరికా మిలిటరీ లాజిస్టిక్స్ హబ్‌ను టార్గెట్ చేసుకుని దాడులు చేసింది.

ఇరాన్ మిలిటరీ ఫెసిలిటీల విధ్వంసం

ఇరాన్ తీర ప్రాంతంలోని మిలిటరీ ఫెసిలిటీలపై అమెరికా విరుచుకుపడింది. సిరిక్, బందర్ అబ్బాస్ సమీపంలో దాడులు చేసింది. బుషెహర్‌లో మూడు చోట్ల దాడులు జరిపినట్లు ఇరాన్ పేర్కొంది. ఇరాన్‌షాహర్‌లోని బాంబర్ గారిసన్‌పై కనీసం 13 సార్లు దాడి చేసిందని, ఈ దాడిలో ఉద్రిక్త సిబ్బంది మరణించినట్లు తెలిపింది. ఎక్కువ మంది సిబ్బందిని చంపే ఉద్దేశంతోనే గెస్ట్‌హౌజ్, గార్డ్ పోస్టులపై దాడులు జరిపిందని ఆరోపించింది. కాగా, హోర్ముజ్‌లో నౌకల కదలికలను పర్యవేక్షించే చాబహార్‌లోని మ్యారిటైం ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌నూ పేల్చేసింది. కాగా, బహ్రెయిన్, కువైట్, ఖతర్, జోర్డాన్ సహా పలు గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో 35 మరణించారని, సుమారు 300 మంది గాయపడినట్లు ఇరాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది.

వ్యూహాత్మక తూంబ్ దీవిపై దాడి

పరీయన్ గల్ఫ్‌లోని తూంబ్ దీవిపై అమెరికా నిప్పులు కురిపించింది. హోర్ముజ్ జలసంధిని నియంత్రించడానికి ఇరాన్‌కు ఈ దీవి వ్యూహాత్మకంగా ఉపయోగపడుతున్నది. నౌకల అనుమతికి, వాటిపై దాడులకు ఇది కీలకంగా ఉన్నది. జలసంధి పశ్చిమ ద్వారం వద్దనున్న ఈ దీవి కూల్చడానికి వీలుకాని తమ ఫైటర్ జెట్ ఈ దీవి అని ఇరాన్ గొప్పలు చెబుతుంది. ఈ దీవి దాడితో వ్యూహాత్మకంగా అమెరికా ఆ జలసంధిపై ఇరాన్ పట్టును నీరుగారుస్తున్నది. ఈ దీవిపై దాడితో నౌకలపై దాడి చేసే ఇరాన్ సామర్థ్యాలను దెబ్బతీశామని సెంటకాం కూడా వెల్లడించింది.

పౌర వసతులపైనా దాడులు?

ట్రంప్ మొన్న ఇరాన్‌కు వార్నింగ్ ఇస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వారం ఇరాన్‌కు చుక్కలు చూపిస్తామని పేర్కొన్న ఆయన.. ఇరాన్ శాంతి చర్యలకు రాకుంటే వారి విద్యుత్ కేంద్రాలు, బ్రిడ్జీలు, ఇతర పౌర వసతులనూ ధ్వంసం చేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఆయన వార్నింగ్ ఇచ్చిన మరుసటి రోజే అమెరికా భీకరంగా విరుచుకుపడింది. అయితే, ఈ దాడుల్లో కొన్ని పౌర మతుల ధ్వంసమయ్యాయని వార్తలు రాగా.. వాటిని సెంటకాం ఖండించింది. మరోవైపు, ఇరాన్ శాంతి చర్యలకు ఏమాత్రం సానుకూలంగా వ్యవహరించడం లేదు. శాంతి చర్చలకు వచ్చే ప్రసక్తే లేదని ఇరాన్ పేర్కొంది. తామిప్పుడు దేశ రక్షణపైనే ఫోకస్ పెట్టామని తెలిపింది.

హోర్ముజ్ దిగ్బంధనం..

హోర్ముజ్ జలసంధి అమెరికా మళ్లీ దిగ్బంధనం మొదలుపెట్టినట్టు మంగళవారం ప్రకటించింది. ఇరాన్ పోర్టులను దిగ్బంధిస్తున్నట్టు పేర్కొంది. తాజాగా, ఇరాన్‌కు చెందిన రెండు నౌకలను అడ్డుకున్నట్టు తెలిపింది. ఆ నౌకలు యూటర్న్ తీసుకున్నాయని వివరించింది. కాగా, హోర్ముజ్ జలసంధి మూసే ఉందని, నౌకలను అపడానికి రెండు వార్నింగ్ షాట్లను ఇరాన్ ప్రయోగించింది. ఈ జలసంధి మూసేమని, నౌకల ప్రయాణం ఉండదని స్పష్టం చేసింది. తమ పోర్టులపై అమెరికా దిగ్బంధించిన నేపథ్యంలో.. ఈ జలసంధి గుండా వెళ్లే అన్ని దేశాల నౌకల వెళ్లాలని, లేదంటే ఏ దేశ నౌకలా వెళ్తేపోవని తెలిపింది. కాబట్టి, పశ్చిమ ఆసియా నుంచి దిగుమతులు ఈ జలసంధి ద్వారా జరగబోవని తేల్చి చెప్పేసింది.

# బలమైన భవిష్యత్తుకు బాల్యమే పునాది

మొదటి తరువాయి

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై మంత్రి సీతక్క బుధవారం సచివాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార సరఫరా, టేక్ హోమ్ రేషన్, అంగన్‌వాడీ తులసిబిడ్డ (బ్రేక్‌ఫాస్ట్ పథకం), అమ్మ మాట--అంగన్‌వాడీ బాట, నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, మౌలిక వసతులు, నియమాలు, బాల్య వివాహాల నివారణ, శిశు రక్షణ ప్రక్రియతో పాటు వివిధ పథకాల బడ్జెట్ విడుదల, వ్యయంపై జిల్లా వారీగా మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "మీ పిల్లలు, మనవాళ్ల వయస్సు ఉన్న చిన్నపిల్లలే అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు. వారిని సొంత పిల్లలుగా భావించి సేవ చేయాలి. పిల్లలు అంగన్‌వాడీ రావడం ఒక మెట్టు.. వారు హుషారుగా, ఆరోగ్యంగా ఎదగడం మరో ఎత్తు వారి మేధాశక్తి పెంచేలా మన సేవల ఉండాలి" అని అధికారులకు సూచించారు. గతంలో ఉమ్మడి జిల్లాలు చాలా పెద్దగా ఉండేవని, ప్రస్తుతం చిన్న జిల్లాలు ఏర్పడినందున మారుమూల చివరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా జిల్లా అధికారులు సందర్శించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సూపర్వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించేందుకు డిప్యూటీలు, సూపర్వైజర్లు తరచూ కేంద్రాల్లో భోజనం చేయాలని సూచించారు. కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేయడం వల్ల మధ్యాహ్న భోజన నాణ్యత పెరిగినట్టే అంగన్‌వాడీల్లో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. గుడ్డు, పప్పు, పాలు, ఇతర పోషకాహార పదార్థాల ఇండెంట్, సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు. నాసిరకం సరుకులు సరఫరా చేసిన సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. "మీకు నాణ్యమైన సరుకులు రాకపోతే ముందుగానే మాకు రిపోర్ట్ చేయండి. పిల్లలకు క్లీన్ ఫుడ్ అందాలి. గర్భిణులు, బాలింతల విషయంలో ఎలాంటి రాజీ ఉండదు. మంచి జరిగిరా, లోపం ఉన్నా మీ అసహ్యాలను మాకు తెలియజేయండి. వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరుస్తా" అని తెలిపారు. ఒకట్రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాసిరకం కోడి గుడ్లు సరఫరా చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆయా వార్తలపై జిల్లా అధికారులు వెంటనే సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. శాఖ పరిధిలో మహిళలు, పిల్లలకు సంబంధించి ఏదైనా తీవ్రమైన ఘటన జరిగినా తక్షణమే ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి సమాచారం అందించాలని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకం మంచి ఫలితాలు ఇస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల చిన్నారుల హాజరు పెరగడంతో పాటు అభ్యాస సామర్థ్యం కూడా మెరుగుపడుతోందన్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేసేలా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. "అమ్మ మాట--అంగన్‌వాడీ బాట" కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య ఎంత మేర పెరిగిందో జిల్లా వారీగా నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. పాలు అందించడం వంటి నూతన కార్యక్రమాల ఫలితాలను కూడా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన 2,500 నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. భూమి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచుల సమక్షంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అచరాన్ని బట్టి భవిష్యత్తులో మరో 2,500 నుంచి 3,000 అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే మంజూరైన భవనాలను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి, ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా వర్చువల్ విధానంలో ఒక్కసారి ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు మానసిక ఆహ్లాదాన్ని కలిగించేలా రంగులతో ఆకర్షణీయంగా ఉండాలని సూచించారు.

## పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా
# పీవోకేలో లాంగ్‌మార్చ్..!

న్యూఢిల్లీ
పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చడానికి విధించిన గడువు ముగియడంతో..ది జమ్ముకశ్మీర్ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ' ఉద్యమాన్ని మరింత తీవ్రం చేసింది. రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు వేలాది మంది నిరసనకారులు లాంగ్ మార్చ్ చేపట్టారు.పీవోకే లో పాకిస్థాన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, ఆ నేతల అకృత్యాలకు వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పీవోకేలో ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు వీలుగా నిత్యావసర వస్తువులపై రాయితీలు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు గుర్తింపు తదితర 38 డిమాండ్లు నెరవేర్చాలని జేఏఏసీ కోరుతోంది.

## 100 శాతం పెట్రోలే కావాలంటే.. ఎక్కువ ధర చెల్లించాల్సిందే

**వాహనదారులకు స్పష్టంచేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**



న్యూఢిల్లీ,
మాకు ఇథనాల్ కలిపిన పెట్రోల్ వద్దు.. స్వచ్ఛమైన పెట్రోలే కావాలని కోరుకుంటున్నారా? అయితే దానికి మీరు అధిక ధర చెల్లించాల్సి ఉంటుంది' అని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఈ20 ఇథనాల్ పాలసీపై దేశ వ్యాప్తంగా విమర్శలు వస్తున్నా.. ఆయన దానిని గట్టిగా సమర్థించారు. ఒక ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ20తో వాహనాల ఇంజిన్లు పాడవుతున్నాయన్న ఆరోపణలను తిరస్కరించారు. అది పూర్తిగా తప్పుడు సమాచారమని, ఇథనాల్ ఇంధనంతో తమ వాహన ఇంజిన్ పాడైనట్టు తమకు ఇంతవరకు ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తెలిపారు. 'ఇథనాల్ ఇంధనాన్ని ఇష్టపడని వాహనదారులు 100 శాతం పెట్రోల్‌కు వెళ్లవచ్చు. అయితే వారు దానికి అధిక ధరను చెల్లించాల్సి ఉంటుంది' అని ఆయన తెలిపారు

## పార్లమెంట్‌లో 'స్మార్ట్'
# పరికరాలు వాడొద్దు

*ఎంపీలకు లోక్‌సభ సచివాలయం సూచన*



న్యూఢిల్లీ
ఈ నెల 20 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు హాజరయ్యే ఎంపీలు స్మార్ట్ వాచీలు, స్మార్ట్ గ్లాసులు వంటివి వినియోగించవద్దని లోక్‌సభ సచివాలయం సూచించింది. వీటి కారణంగా వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇదేవిధంగా పార్లమెంట్ ఆవరణలో ఎంపీలు ధర్నాలు చేయడం, ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు ప్రదర్శించడం, మతపరమైన కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేయకూడదని కోరింది. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20న ప్రారంభమై, ఆగస్టు 13 వరకూ కొనసాగనున్నాయి.

## సంపాదకీయం

# కొలువు కోసం..!




తెలంగాణ ఉద్యమ చరిత్రను ఒక్క నినాదంలో చెప్పాలంటే అది "నీళ్లు, నిధులు,నియామకాలు". నీటి కోసం రైతు పోరాడాడు. నిధుల కోసం ప్రాంతం ఉద్యమించింది. కానీ, అత్యంత ఉద్వేగంతో వీధుల్లోకి వచ్చింది మాత్రం నిరుద్యోగ యువత. లక్షలాది మంది విద్యార్థులు చదువులను పక్కనపెట్టి ఉద్యమంలో పాల్గొన్నారు. ఎందుకంటే, ప్రత్యేక రాష్ట్రమొస్తే ఉద్యోగాలు వెల్లువలా వస్తాయని, ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన ఖాళీలు భర్తీ అవుతాయని, నిరుద్యోగం కాలగర్భంలో కలిసి పోతుందని కలలు కన్నారు. కానీ, రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం దాటింది. ప్రభుత్వమూ మారింది. ఉద్యోగాల కోసం యువత రోడ్డెక్కాల్సిన దుస్థితి మాత్రం మారలేదు. రాష్ట్ర రాజధానిలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన "నిరుద్యోగుల ధర్నా" అందుకు ప్రత్యక్ష నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముందు "హైదరాబాద్ యూత్ డిక్లరేషన్" పేరుతో ఇచ్చిన హామీలు యువతలో భారీ ఆశలు రేకెత్తించాయి. "యేటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తాం" అని చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి తప్ప, ఆచరణకు నోచుకోలేదు. పైగా "నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తాం, ఖాళీలన్నింటినీ పారదర్శకంగా భర్తీ చేస్తాం, ప్రతి జిల్లాలో ఉద్యోగ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం" ఈ వాగ్దానాలన్నీ బుట్టదాఖల య్యాయి. రాష్ట్రంలో అసలు ఎంతమంది నిరుద్యోగులున్నారు? ఖాళీలెన్ని? భర్తీ చేసినవెన్ని? ఇలాంటి అంశాలపై ఇంతవరకు ఓ నిర్ధారణ లేదంటే అతిశయోక్తి కాదేమో! రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు అరవై ఏడు వేల పైచిలుకు నియామకాలు పూర్తయ్యాయని చెబుతోంది. అయితే అందులో పదహారు వేలకు పైగా పోస్టులు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేపట్టిన నియామకాలుగా తెలుస్తోంది. అందులో పోలీస్ కానిస్టేబుళ్లకు సంబంధించినవే ఎక్కువ. మిగిలిన పోస్టులు గతంలో జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రక్రియ పూర్తవడంతో జరిగిన నియామకాలే. మరోవైపు రాష్ట్రంలో ఇంకా ఎనభై ఏడు వేలకుపైగా ప్రభుత్వ ఖాళీలు ఉన్నాయని నిరుద్యోగ సంఘా ల వాదన. ముఖ్యం గా టీచర్ పోస్టుల్లో నలభై ఆరు వేలు ఖాళీగా ఉండటం ప్రభుత్వ విద్యా వ్యవస్థకు, లక్షలాది నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసినట్టే! జాబ్ క్యాలెండర్ ప్రకారం భర్తీ చేస్తానన్న ఖాళీలను పట్టించుకోక పోవడం నిరుద్యోగుల ఆగ్రహానికి ప్రధాన కారణం.పైగా నోటిఫికేషన్ కోసం ఏండ్ల తరబడి ఎదురు చూడడం, పరీక్షలు రాయడం, ఫలితాల కోసం మరో ఏడాది వేచి ఉండడం, కోర్టు కేసులతో నియామకాలు నిలిచిపోవడం వారి జీవితంలో భాగమైపోయింది. ఒక ఉద్యోగం కోసం ఐదేళ్లు, ఆరేళ్లు సిద్ధమవుతున్న యువతకు వయోపరిమితి దాటిపోతున్నది. వారి జీవితంలోని బంగారు కాలం పరీక్ష గదుల్లోనే ముగిసిపోతోంది. దీనికి బాధ్యతెవరిది? ఇకపోతే ఉద్యోగం కోసం సిద్ధమవుతున్న యువతను మరోవైపు కోచింగ్ సెంటర్ల వ్యాపారం నిలువునా దోచుకుంటోంది. లక్షల రూపాయల ఫీజులు, హాస్టల్ ఖర్చులు, పుస్తకాలు, పరీక్ష ఫీజులు... ఇవన్నీ భరించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారు, భూములు అమ్ముకుంటున్నారు, బంగారం తాకట్టు పెడుతున్నారు. కానీ, ఉద్యోగం వస్తుందన్న గ్యారంటీ లేదు.ఇప్పుడదే వారిని తీవ్రంగా వేధిస్తోంది. అందుకే 'కొలువులకై కొట్లాడుదాం' అంటూ యువత రోడ్డుపైకి వస్తోంది. ఇదిలా ఉంటే, మరోవైపు వేలాది మంది నిరుద్యోగులు బతుకుదెరువు కోసం జొమాటో, స్విగ్గీ డెలివరీ బాయ్స్‌గా, క్యాబ్ డ్రైవర్లుగా, గిగ్ వర్కర్లుగా పనిచేస్తూ మిగిలిన సమయంలో పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పగలు శ్రమ, రాత్రి చదువు, ఇదే వారి దినచర్య. ఉద్యోగం కోసం పోరాటం చేస్తున్న యువతను ఈ స్థితికి నెట్టిన ప్రభుత్వాలు వారి బాధకు సమాధానం చెప్పాలి. ఈ సంక్షోభంలో కేంద్రానిదే ప్రధాన బాధ్యత. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీకి నోచుకోవడం లేదు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, ప్రయివేటీకరణను వేగవంతం చేస్తూ స్థిరమైన ఉద్యోగాలను తగ్గించింది. ఆ స్థానంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌ను ప్రవేశపెట్టింది. పైగా 'పకోడీలు అమ్మడం, బజ్జీలు వేయడం' కూడా ఉద్యోగాలేనని చెపుతూ యువతను హేళన చేస్తోంది. రాష్ట్రం విషయానికొస్తే ప్రత్యేక తెలంగాణ కోసం విద్యార్థులు చేసిన త్యాగాలను ఈ సందర్భంలో మరచి పోవడం చరిత్రను అవమానించినట్టే. "నియామకాలు" అనే పదం ఉద్యమ నినాదంలో ఉండి, పాలనలో కనిపించకపోతే తెలంగాణ ఆత్మనే ప్రశ్నించినట్లవుతుంది. సర్కారు బాధ్యత- ఉద్యోగం కోసం పోరాడుతున్న యువతను చట్టాలు, కేసులు, లాఠీలతో అణచి వేయడం కాదు, ఇచ్చిన హామీలను నెరవేర్చడం. అదే నేటి యువత వీధుల్లో నిలబడి అడుగుతోంది. ఈ ప్రశ్నకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాధానం చెప్పాల్సిందే.

# ప్రజా సేవలోనూ పార్టీ బాధ్యతల్లోనూ సమన్వాయం చేస్తున్న భవాని ప్రవీణ్ కుమార్.

**గడ్డి అన్నారం - 15 జూలై (మహాప్రభ)**
గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఒకవైపు ప్రజా సేవ, మరోవైపు పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శ నాయకత్వాన్ని చాటుతున్నారు. ప్రజల పక్షాన ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో డివిజన్‌లోని ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలనే లక్ష్యంతో గడ్డిఅన్నారం డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం గుడ్ మార్నింగ్ గడ్డిఅన్నారం కార్యక్రమంతో ప్రజలను కలుస్తూ, అనంతరం హెల్ప్ డెస్క్‌ల వద్ద స్వయంగా కూర్చొని ఓటరు నమోదు, ఎన్యుమరేషన్ ఫారాల పూరణ, సందేహాల నివృత్తిలో ప్రజలకు సహాయం చేస్తున్నారు. అదే సమయంలో ఈ నెల 18వ తేదీన




సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు కేటీఆర్ ముఖ్య అతిథ్యంతో, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సు విజయవంతానికి సంబంధించిన ఏర్పాట్లను కూడా సమన్వయం చేస్తున్నారు. సభకు యువతను పెద్ద ఎత్తున సమీకరించడం, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించడం వంటి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ప్రజల ఓటు హక్కు పరిరక్షణతో పాటు పార్టీ కార్యక్రమాల విజయవంతం కోసం ఒకే సమయంలో



అహర్నిశలు శ్రమిస్తున్న భవాని ప్రవీణ్ కుమార్ సేవా తత్పరత, కార్యదక్షత, నాయకత్వం ప్రజలు మరియు పార్టీ శ్రేణుల ప్రశంసలు అందుకుంటోంది.

# గుర్తుతెలియని వ్యక్తి మృతి

### గుర్తించిన వారు పోలీసులకు సమాచారం అందించండి



**తూప్రాన్ జూలై 15,(మహాప్రభ)**
తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ రోడ్డుపై ఈ నెల 13వ తేదీ రాత్రి సుమారు 35 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో (కోమాలో) కనిపించారు. తలకు బలమైన గాయాలు కావడంతో అతడిని వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీ (బుధవారం) ఉదయం ఆ వ్యక్తి మృతి చెందినట్లు తూప్రాన్ ఎస్ఐ యాదగిరి తెలిపారు. మృతుడు ఎవరు, ఏ ప్రాంతానికి చెందినవారు అనే వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదని పేర్కొన్నారు.
ఫోటోలోని వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే తూప్రాన్ పోలీస్ స్టేషన్ వారిని 8712657928 లేదా 8712582002 నంబర్లలో సంప్రదించి సమాచారం అందించి పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని కోరారు.

### జూలై 18న సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నాయకులు.



**ఎల్‌బినగర్ -15 జూలై (మహాప్రభ )**
నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సభ ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి శుభారంభం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, శంభిపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. సభా వేదిక నిర్మాణం, పార్కింగ్ ఏర్పాట్లు, ప్రజల రాకపోకలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలను సమీక్షించి, సంబంధిత కమిటీలకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న యువ సంగ్రామ సభను విజయవంతం చేసి, యువత ఆకాంక్షలను ప్రభుత్వానికి బలంగా వినిపించాలని పార్టీ శ్రేణులు, యువత, ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకేనా దైవభీతి?



నేటి సమాజంలో కొందరి దృష్టిలో, కొన్ని చోట్ల వ్యాపారానికి పెద్ద కేంద్రంగా భక్తి మారింది. కొత్త ఆలయ నిర్మాణమంటే భక్తులు, పాలకమండళ్ల ప్రతినిధులు, పాలకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. ఆలయం ఎంత పెద్ద స్థలంలో, ఎన్ని అంతస్తుల్లో కడుతున్నారన్నదే ప్రధాన అంశం అవుతున్నది. దేశంలో ఓ కొత్త గుడి కట్టగానే 'మీరు చూశారా? చూసొచ్చారా?' అనే చర్చ మొదలవుతున్నది. భక్తుల తాకిడి, హుండీ రాబడి పెరుగడంతో ఆలయ నిర్వాహకుల్లో ధన పిశాచి రెక్కలు విప్పుకొంటున్నది. దేవుడంటే భయభక్తులు ఉన్నవారు దర్శనాలతో తరిస్తుంటే, అస్సలు భయం లేనివారి దారి మరోలా ఉన్నది. చిన్న దొంగ తాను దొంగనని ఒప్పుకొంటాడు. పెద్ద దొంగ మాత్రం మహాభక్తుడిగా వేషం కట్టి, సంప్రదాయ పద్ధతులు పాటించి, అవకాశం చిక్కగానే బందిపోటుగా మారుతాడు .సాధారణ జనం నమ్మకం, ధనవంతుల పాపపరిహారం గుడులను బతికిస్తున్నాయి. గుడి ఆదాయాన్ని బట్టి నిర్వాహకుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఆధునిక హిందూ దేవాలయ నిర్మాణాల్లో అయోధ్య రామాలయం సర్వోన్నతమైనది. ఈ ఆలయం పూర్తికావడానికి ఏడాది ఉండగానే భక్తుల రద్దీ పెరిగింది. అంత గొప్ప పేరున్న రామమందిరం ఈ మధ్య ఊహించని రీతిలో ఇంటి దొంగల బారిన పడి ఎంతోమంది పరువును గంగలో కలిపింది. భక్తిపారవశ్యంలో వరదలా వచ్చిన రామమందిర నిర్మాణ సొమ్ముకు లెక్కే లేకుండా పోయింది. ఆ ధనరాశుల ముందు నిర్వాహకుల భక్తి, నిష్ఠలు తేలిపోయాయి. దేవుడికిచ్చిన సొమ్ము గురించి భక్తులు లెక్కలు అడుగుతారా? అనే ధీమాతో తోచినంత దోచుకున్నారు. 2021లో ఈ ఆలయం కోసం సింధీ సమాజం ఇచ్చిన రూ.రెండు కోట్ల విలువైన వెండి ఇటుకలకు ఇంకా రసీదు అందలేదు. కానీ నకిలీ రసీదు పుస్తకాలు ముద్రణ అయ్యాయి. సీసీ టీవీల కంటపడకుండా నోట్ల సంచులు రోజుల తరబడి రవాణా అయ్యాయి. ఇదంతా తాత్కాలిక ఉద్యోగుల నిర్వాకమైనా..? పెద్దల అండ లేనిదే ఇదంతా సాధ్యం కాదు. 'ఇంత బరితెగిస్తారా?' అని ప్రజలు దిగ్భ్రాంతి చెందుతున్నారు. గుడి నిర్మాణాన్ని ప్రతిష్టగా తీసుకొన్న బీజేపీ పెద్దలు కంగుతిన్నారు. ప్రజల ముందు ముఖం చాటేయలేక యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. సీఎం ఎన్ని సర్దుబాటు మాటలు మాట్లాడినా దోపిడీని కాదనలేని పరిస్థితి. ఇది బహిరంగ రహస్యమే కానీ, నోరు విప్పలేని అవస్థ. 'ఈ హుండీ దొంగల కేసులను ఎట్టిపరిస్థితిల్లోనూ వాదించబోం' అంటూ ఫైజాబాద్ న్యాయవాదుల సంఘం తేల్చిచెప్పింది. ఒకవేళ ఎవరైనా వాదించడానికి ముందుకు వస్తే వారికి రూ.5 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించింది. జాతీయ ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో రామాలయంలో జరిగిన భారీ దోపిడీపై విమర్శనాత్మక చర్చ జరుగుతున్నది. ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ, ఎద్దేవా చేస్తూ ఎన్నో రకాల కార్టూన్లు వస్తున్నాయి. ఆయా కార్టూన్ల ప్రభావం సామాన్య పాఠకులపై తప్పకుండా ఉంటుంది. ఇంత జరిగినా దుష్టశిక్షణ చేయాలని బాల రాముడికి అనిపించడం లేదా? అని సామాన్య భక్తులు ప్రశ్నిస్తున్నారు. అయోధ్య రామాలయంలో నిధులు స్వాహా అయ్యాయని తెలియగానే భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం తగ్గాయనే వార్తలు వస్తున్నాయి. దేవుడనేవాడు ఈ విగ్రహాల్లో ఉంటాడా? పూజలు, యాగాలు ఆయన కోరుకుంటాడా? కానుకలు సమర్పిస్తే కోరికలు తీర్చుతాడా? అనే అనుమానాలు రాకుండా ఇంతకాలం గడిచింది. ఇప్పటివరకైతే అన్నీ దేవుడే చూసుకుంటాడు, వారి కర్మ వారే అనుభవిస్తారని దొంగలను వదిలేసే దయాగుణం భక్తులకు ఉన్నది. ఇంత భారీగా ఆలయ సొమ్ము కాజేసిన దొంగలకు తగిన శిక్ష పడుతుందన్న నమ్మకాన్ని కేంద్రం, యూపీ ప్రభుత్వం కలిగించాలి. రామ జన్మభూమిలో ఆలయ నిర్మాణ ఘనత తమదేనని చెప్పుకొనే బీజేపీ, గుడి పేరుతో రాజకీయంగా లబ్ధి పొందిన బీజేపీ, ఇప్పుడు ఎందుకు స్పందించదు? రామభక్తుల మనోభావాలు దెబ్బతిన్నప్పుడు మౌనం వహించడం ఎంతవరకు సమంజసం?

## దొంతి గ్రామ ఉన్నత పాఠశాలకు నాలుగు కంప్యూటర్ల విరాళం

తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహం



**శివంపేట, జూలై 15(మహాప్రభ):**
శివంపేట మండల పరిధిలోని దొంతి గ్రామంలో తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం ఆధ్వర్యంలో, గ్రామ ముద్దుబిడ్డ, గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న మల్లవరం మల్లారెడ్డి సార్ చొరవతో గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నాలుగు కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచ్ భవనగారి శ్రీనివాస్ మాట్లాడుతూ, పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంట్లో ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌లు, టీవీలకు దూరంగా ఉండి చదువుపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు.అలాగే, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు చదువుకునే సమయంలో ఇంట్లో టీవీలు ఆఫ్ చేసి, ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని గ్రామ పాలకవర్గం తరఫున విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం సభ్యులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌కు చెందిన సుబ్బరి సాహితికి నంది అవార్డు

- జిల్లా ఆల్ మ్యారేజ్ బ్యూరో మహిళా అధ్యక్షురాలిగా ఎంపిక



**శివంపేట, జూలై 15(మహాప్రభ)**
మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుబ్బరి సాహితి సామాజిక సేవలో గుర్తింపు పొందుతూ ప్రతిష్ఠాత్మక నంది అవార్డును అందుకున్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఆల్ మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలిగా సుబ్బరి సాహితిని నూతనంగా ఎన్నుకున్నారు. ఆమె 2023లో నర్సాపూర్ పెద్దమ్మ కాలనీలో సందీప్--సాహితి మ్యారేజ్ బ్యూరోను ప్రారంభించి, వివాహ సంబంధాల ఏర్పాటులో సేవలు అందిస్తున్నారు. 2026 సంవత్సరంలో ఆమె ఆధ్వర్యంలో ఐదు వివాహ సంబంధాలు విజయవంతంగా కుదిరాయి. కుటుంబాలను కలపడంలో ఆమె చేసిన కృషిని గుర్తిస్తూ ఈ అవార్డుతో పాటు అసోసియేషన్ బాధ్యతలను అప్పగించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరి సాహితి మాట్లాడుతూ, సమాజంలో మంచి కుటుంబాలను కలిపే సేవను మరింత బాధ్యతతో కొనసాగిస్తూ, అవసరమైన వారికి విశ్వసనీయమైన వివాహ సంబంధాల సేవలను అందిస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత అంతిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

-పార్థివదేహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ జూలై 15 ( మహాప్రభ )**
డిండి మండలం ఖానాపూర్ గ్రామపంచాయతీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్తాని అంతిరెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. అంతిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలు నాయక్ ఖానాపూర్ గ్రామానికి చేరుకొని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనోధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ బలోపేతానికి నిబద్ధతతో పనిచేసిన సీనియర్ నాయకుడు ముత్తాని అంతిరెడ్డి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మృతి పార్టీకి, ఖానాపూర్ గ్రామ ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.అంతిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిండి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు , పార్టీ సీనియర్ నాయకుడు యాదగిరిరావు , డిండి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, శాంతిగూడెం సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల శశిధర్ రెడ్డి , సర్పంచ్ శంకర్, కొర్ర రవి, మాజీ సర్పంచ్ రాజుపార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని అంతిరెడ్డి కి నివాళులర్పించారు

# స్వర్ణ పతకం సాధించిన నారిమళ్ల ప్రవళికకు డిండిలో ఘన స్వాగతం







**-టీపీసీసీ ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు ఆధ్వర్యంలో సన్మానం**

**దేవరకొండ జూలై 15 ( మహాప్రభ )**
చైనాలోని ఒర్డోస్ నగరంలో ఇటీవల నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్--2026లో మహిళల 4ఐ400 మీటర్ల రిలే పోటీలో భారత జట్టు తరఫున అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ రాష్ట్రం, నల్గొండ జిల్లా, డిండి మండలానికి చెందిన యువ అథ్లెట్ నారిమళ్ల ప్రవళిక స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా డిండిలో ఘన స్వాగతం పలికారు. గ్రామ ప్రజలు, యువకులు, క్రీడాభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఆమెకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ యేకుల రాజారావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతం నుంచి ఎదిగి అంతర్జాతీయ వేదికపై భారత జాతీయ పతాకాన్ని గర్వంగా ఎగురవేసిన ప్రవళిక సాధించిన విజయం ప్రతి తెలంగాణ యువతకు ఆదర్శమని అన్నారు. కష్టపడి సాధన చేస్తే ప్రపంచ స్థాయిలో కూడా విజయం సాధించవచ్చని ప్రవళిక నిరూపించిందని కొనియాడారు.
మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో భారత జట్టు



అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం సాధించడం దేశానికి గర్వకారణమని, ఆ జట్టులో తెలంగాణకు చెందిన నారిమళ్ల ప్రవళిక ఉండటం నల్గొండ జిల్లాకు ప్రత్యేక గౌరవాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆసియా క్రీడలు, కామన్‌వెల్త్ క్రీడలు, ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ పోటీల్లో కూడా భారతదేశానికి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రవళిక సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను కూడా ప్రత్యేకంగా అభినందిస్తూ, ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులకు కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం ప్రవళిక వంటి అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారులను మరింత ప్రోత్సహించి, తగిన నగదు ప్రోత్సాహకాలు, ఉద్యోగ అవకాశాలు, అత్యాధునిక శిక్షణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తే మరెంతో మంది అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.
ప్రవళిక మాట్లాడుతూ తన విజయానికి తన తల్లిదండ్రులు నారిమాళ్ళ రాంబాబు విజయ , కోచ్ పరుశురాం, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు లు, భారత అథ్లెటిక్స్ సమాఖ్య, సహచర ఆటగాళ్లు అందించిన ప్రోత్సాహమే కారణమని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి అభినందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా దేశానికి మరిన్ని విజయాలు అందించేందుకు మరింత కష్టపడి శ్రమిస్తానని చెప్పారు.
ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రముఖులు, నాయకులైన యేకుల సురేష్, బోయిన చంద్రమౌళి, మేడ సైదులు, భయ్యా శ్రీను, నారిమల్ల మల్లేష్, అవుట మల్లేష్, ఎర్ర వెంకటయ్య, నిరటి బాలరాజు, నరిమల్ల ఇద్దయ్య, చేపూరి మురళి, మరియు నారిమల్ల ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు. క్రీడాభిమానులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నారిమళ్ల ప్రవళికకు ఘనాభినందనలు తెలియజేశారు

## దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

-అధ్యక్షుడు:ఎన్.వి.టి



**దేవరకొండ జూలై 15 ( మహా ప్రభ )**
స్థానిక వివేకనంద ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు ఎన్ వి టి సభ్యులతో మరియు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీచే స్థాపించబడిన ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం, యువతకు ఉపాధి, గౌరవప్రదమైన పని, వ్యవస్థాపకత మరియు జీవితకాల అభ్యాసం కోసం నైపుణ్యాలను అందించడంలో ఉన్న వ్యూహాత్మక విలువను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యం అని, యువత మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, వల్లమల్ల ఆంజనేయులు, ఎ గణేష్, ఎ. గౌతమ్, సుధాకర్, రాము ,రోజా, అంజలి ,లావణ్య, రాజేష్, క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా టిపిసిసి ఎస్సీ విభాగం జనరల్ సెక్రెటరీ డాక్టర్ ఏకుల రాజారావు జన్మదిన వేడుకలు



**దేవరకొండ జూలై 15 ( మహాప్రభ )**
టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని బహుజన నాయకులు, దళిత నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి, యేకుల రాజారావు కి మిఠాయిలు తినిపించి అభినందనలు అందజేశారు. బహుజనుల, దళితుల అభ్యున్నతికి మరియు పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ ఘనమైన జన్మదిన వేడుకల కార్యక్రమంలో ప్రముఖులు, నాయకులైన యేకుల సురేష్, బోయిన చంద్రమౌళి, మేడ సైదులు, భయ్యా శ్రీను, నారిమల్ల మల్లేష్, అవుట మల్లేష్, ఎర్ర వెంకటయ్య, నిరటి బాలరాజు, చేపూరి మురళి, మరియు నారిమల్ల ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ యేకుల రాజారావు కి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## దివంగత నేత ఆకుల రమేష్ గౌడ్ జయంతి సందర్భంగా ఘన నివాళులు.




**ఎల్‌బినగర్ -15 జూలై (మహప్రభ)**
ఎల్ బి నగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, దివంగత ప్రజానాయకుడు ఆకుల రమేష్ గౌడ్ జయంతి సందర్భంగా ఎల్ బీ నగర్ రింగ్ రోడ్‌లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొని ఆకుల రమేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, ఆకుల రమేష్ గౌడ్ ప్రజల పట్ల అపారమైన అంకితభావంతో పనిచేసిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, సమాజ సేవకు విశేష సేవలందించిన వారి కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆకుల రమేష్ గౌడ్ ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయమని, సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆకుల రమేష్ గౌడ్ కి ఘనంగా నివాళులర్పించారు.

## పత్తి విత్తనాల పంపిణీ

-సర్పంచ్: గోపాల్ నాయక్




**దేవరకొండ జూలై 15 ( మహాప్రభ )**
ఈరోజు పోల్య నాయక్ తండ గ్రామపంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పత్తి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఈరోజు గ్రామపంచాయతీ సర్పంచ్ గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ రైతులకు పత్తి విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చందంపేట మండల వ్యవసాయ అధికారి ఏఈఓ ప్రవీణ్ గారు పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో మూడు దండ్ల మాజీ ఎంపీటీసీ ఇస్లావత్ సునీత బాలవర్ధిరాజు పోల్య నాయక్ తండా గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు రైతులు ప్రజలు పాల్గొనడం జరిగింది

## జార్పాల తండాలో కోళ్ల ఫారం తొలగించాలని రోడ్డుపై గ్రామస్థుల ధర్నా



**దేవరకొండ డివిజన్ జూలై 15 ( మహాప్రభ )**
చింతపల్లి మండలం జార్పాల తండా, ఉమ్మెత్తలపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం రోడ్డుపై ధర్నా నిర్వహించారు. కోళ్ల ఫారం నుంచి వస్తున్న దుర్వాసన, ఈగల బెడదతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న వెంటనే మండల ఎంపీడీవో సుజాత, స్థానిక ఎస్సై ముత్యాల రామ్మూర్తి సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కోళ్ల ఫారం నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా ఇళ్లలో ప్రశాంతంగా ఉండలేకపోతున్నామని, ఈగల బెడదతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు తెలిపారు. రోజువారీ జీవనం ఇబ్బందికరంగా మారిందని, ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ కోళ్ల ఫారాన్ని వెంటనే గ్రామ శివారు నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉపసర్పంచ్ జైపాల్ నాయక్, వార్డు సభ్యులు రమేష్, రాజు, వెంకట్రాం, నరి, మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ దసురు, వార్డు సభ్యుడు మధు, శ్రీను, అలాగే గ్రామస్థులు శంకర్, పాండు, బిక్షం, కిషన్, రవి, కుమార్, రాజు నాయక్, సంతోష్, బాలు, నారియా, వెంకటేష్, గాంధీ, జిత్తు, గురు, శ్రీను, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## హస్తినాపురం డివిజన్‌లో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.





**ఎల్బినగర్ – 15 జూలై (మహప్రభ)**
హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీలో ఇండ్ల మధ్యలో ఉన్న ప్లాస్టిక్ గోదాంలో మంగళవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే ఎల్ బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిమాపక శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అగ్నిప్రమాదం కారణంగా గోదాం పక్కనే ఉన్న నూతన గృహంలోని గృహోపకరణాలు, ఫర్నిచర్ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జరిగిన నష్టాన్ని పరిశీలించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం సంతోషకరమైన విషయమని అన్నారు. భవిష్యత్తులో నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి గోదాంలు ఏర్పాటు కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ నివాస ప్రాంతాల్లో ప్రమాదకర గోదాంల ఏర్పాటుపై అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ప్రభుత్వం తరఫున తగిన సహాయం అందేలా జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి నష్టపరిహారం మంజూరు చేయించేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్కాపూర్‌లో ప్రకృతి వ్యవసాయ కేంద్రం ప్రారంభం



**తూప్రాన్, జూలై 15 (మహాప్రభ)**
తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామపంచాయతీలో వాసన్ టాటా గ్రూప్ సహకారంతో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) టి. శాలిక బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో టి. శాలిక మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత కలిగిన పంటలను పండించే అవకాశముందని అన్నారు. రైతులు రసాయన రహిత సాగు విధానాలను అవలంబించి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తికి తోడ్పడాలని సూచించారు. వాసన్ టాటా గ్రూప్ అందిస్తున్న సహకారం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మండల పంచాయతీ అధికారి, మల్కాపూర్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, సేంద్రియ సాగు విధానాలు, రైతులకు అందుబాటులో ఉండే సేవలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేందుకు అందరూ కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

# కుమ్మరుల తొలి బోనాల మహోత్సవం సందర్భంగా ప్రత్యేక బోనాల పాట ఆవిష్కరణ.

**ఎల్ బి నగర్ -15 జూలై (మహప్రభ)**
హైదరాబాద్ నగరంలోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద 16-07-2026 తేదీన జరగనున్న శ్రీ కనకాల కట్ట మైసమ్మ తల్లి కుమ్మరుల తొలి బోనాల మహోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన బోనాల పాటను యువ నాయకుడు భాస్కర్ సూర్య రచించి తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘటీ ఆర్ కే ఎస్ కు అందజేశారు. ఈ ప్రత్యేక గీతాన్ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘటీ ఆర్ కే ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు నాయకత్వంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు మాట్లాడుతూ, కుమ్మరుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు చేరవేసే ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. బోనాల మహోత్సవ విశిష్టతను



చాటి చెప్పే ఈ పాట ప్రజల్లో విశేష ఆదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యువ నాయకుడు భాస్కర్ సూర్యను ప్రత్యేకంగా అభినందిస్తూ, కుమ్మర జాతి ఆత్మగౌరవాన్ని, కులవృత్తి గొప్పతనాన్ని పాటల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా సమాజానికి స్ఫూర్తినిచ్చే మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్ గ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం , రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఇరిగిశెట్టి వీరయ్య , రాష్ట్ర సహాయ కార్యదర్శి జిల్లెల శంకరయ్య , రంగారెడ్డి జిల్లా సలహాదారు మల్కాజిగిరి యాదయ్య , ఎల్‌బీ నగర్ డివిజన్ అధ్యక్షులు నడికుడి అశోక్ , రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి ఇరిగిశెట్టి బాలరాజ్ పాల్గొని భాస్కర్ సూర్యను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమం కుమ్మర జాతి ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, సంస్కృతి పరిరక్షణకు, యువతలో చైతన్యం నింపేందుకు ఒక మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# నా రిమల్ల ప్రవళిక దేశానికే గర్వకారణం

### -ఎమ్మెల్యే బాలు నాయక్

**దేవరకొండ జూలై 15( మహాప్రభ )**
నిరుపేద కుటుంబం నుంచి అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం.. నారిమల్ల ప్రవలిక దేశానికే గర్వకారణం: దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ చైనాలో జరిగిన ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 4x400 మీటర్ల మహిళల రిలేలో ప్రవల్లికకు స్వర్ణం చైనా వెళ్లేందుకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ నియోజకవర్గం:**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబ బిడ్డ నారిమల్ల ప్రవల్లిక అంతర్జాతీయ అథ్లెటిక్స్ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించడం దేశానికే గర్వకారణమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. చైనాలోని ఓర్డోస్‌లో జూలై 9 నుంచి 12 వరకు నిర్వహించిన 1వ ఆసియా అథ్లెటిక్స్ అండర్-23 ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4x400 మీటర్ల రిలే విభాగంలో నారిమల్ల ప్రవలిక భారత జట్టు తరఫున పాల్గొని స్వర్ణ పతకం సాధించారు. ఈ సందర్భంగా ప్రవలికను ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ హృదయపూర్వకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. డిండి మండల కేంద్రానికి చెందిన నారిమల్ల రాంబాబు, విజయ దంపతుల కుమార్తె ప్రవల్లిక అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను అధిగమిస్తూ అథ్లెటిక్స్‌లో ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రవల్లిక తండ్రి ఇళ్ల నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి కూలి పని



చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేసిన ప్రవలిక నేడు అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి బంగారు పతకం అందించి డిండి గడ్డ కీర్తిని ప్రపంచానికి చాటారు.
ప్రవలిక చైనాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక రూ..1 లక్ష ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారులి. ఎమ్మెల్యే అందించిన సహాయంతో స్ఫూర్తి పొందిన ప్రవలికకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు సైతం ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ ని కలిసిన ప్రవలిక భావోద్వేగంతో మాట్లాడుతూ.. "సార్.. నేను చైనాలో పోటీలకు వెళ్లే సమయంలో ఆర్థికంగా ఎంతో ఇబ్బందుల్లో ఉన్నాను. అలాంటి సమయంలో మీరు చేసిన రూ.లక్ష ఆర్థిక సహాయం నాకు ఎంతో అవసర సమయంలో ఉపయోగపడింది సార్. మీరు అందించిన సహాయం, ప్రోత్సాహం నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయి. మీ సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలేను" అంటూ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. లి"నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన మన డిండి బిడ్డ ప్రవలిక అంతర్జాతీయ వేదికపై స్వర్ణ పతకం సాధించడం ఎంతో గర్వంగా ఉంది. మన దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, నల్లగొండ జిల్లాకు, ముఖ్యంగా దేవరకొండ ప్రాంతానికి ఆమె పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం అభినందనీయం. పేదరికం ప్రతిభకు అడ్డుకాదని ప్రవల్లిక తన విజయంతో నిరూపించింది. భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించి దేశ కీర్తిని ప్రపంచ వేదికపై మరింతగా చాటాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానుఅని అన్నారు. ప్రవలిక క్రీడా భవిష్యత్తుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తో పాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవలికకు కల్పించేందుకు కృషి చేస్తామనిలి ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. అలాగే ప్రవలికను అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ఆమె కోచ్ లిపసుపుల పరశురాములు ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభావంతులైన గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ దేశానికి గొప్ప క్రీడాకారులను అందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు.
ప్రవల్లిక ఇంటర్మీడియట్ విద్యను డిండిలో పూర్తి చేసి, ప్రస్తుతం నల్లగొండ చర్లపల్లిలోని మహిళా డిగ్రీ కళాశాలలోలి విద్యనభ్యసిస్తున్నారు.
డిండి గడ్డ నుంచి అంతర్జాతీయ వేదిక వరకు ఎదిగి.. భారతదేశానికి స్వర్ణ పతకం అందించిన నారిమల్ల ప్రవల్లిక నేటి యువతకు స్ఫూర్తి"అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గారు పేర్కొన్నారు.

# తూప్రాన్‌లో చోరీ కేసు ఛేదన..
# 12 గంటల్లోనే నిందితుడి అరెస్ట్






### -రూ.7 లక్షల నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం..
### -పోలీసు బృందానికి ఎస్పీ అభినందనలు

**తూప్రాన్, జూలై 15 (మహాప్రభ)**
తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 12 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.7 లక్షల నగదు, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, రెండు జతల వెండి మెట్టెలను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు గంజి పాండురంగం (50) తన కుమార్తె వివాహం కోసం దాచిపెట్టిన రూ.7 లక్షల నగదు, వెండి ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తి జూలై 14న దొంగిలించాడని తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీఎస్పీ జె. నరేందర్ గౌడ్ ఆదేశాల మేరకు, రామాయంపేట సీఐ (ఇన్‌చార్జ్ తూప్రాన్) బి. సైదా నాయక్, తూప్రాన్ ఎస్ఐ వి. గంగరాజు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, సమాచారాన్ని వినియోగించి వేగంగా దర్యాప్తు చేపట్టాయి. కేవలం 12 గంటల్లోనే నిందితుడిని గుర్తించి అరెస్టు చేశాయి. అరెస్టైన నిందితుడు వల్లపు రాజు (32), తండ్రి రాములు, వడ్డెర కులానికి చెందిన కూలీ. స్వగ్రామం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అంబర్‌పేట్ కాగా, ప్రస్తుతం మెదక్ జిల్లా మాసాయిపేట్ మండలం వడ్డెర కాలనీలో నివాసం ఉంటున్నాడు. గతంలోనూ అతనిపై రెండు చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.
నిందితుడి వద్ద నుంచి రూ.7,00,000 నగదు, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, రెండు జతల వెండి మెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.7,03,000గా పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇళ్లలో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని, ఇల్లు ఖాళీగా వదిలి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందంలో ఎస్ఐలు వి. గంగరాజు, చైతన్య రెడ్డి, కానిస్టేబుళ్లు రాజు, మహేష్, నర్సింలు, చంద్రం ప్రసాద్, సాయిబాబా, వెంకటేష్, సతీష్ నారాయణరావు, పాషా పాల్గొన్నారు. వారి సేవలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందిస్తూ తగిన రివార్డును ప్రకటించారు.

# బిజినెస్

## రూ.6.7 లక్షల కోట్లు ఫట్..

**ఒక్కరోజే 25 శాతం పడిపోయిన ఐబీఎం షేర్ విలువ**

**58 ఏండ్లలో ఈ స్థాయి పతనం తొలిసారి**

**న్యూఢిల్లీ/న్యూయార్క్,**



అమెరికాకు చెందిన బహుళజాతి టెక్నాలజీ దిగ్గజం ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్) షేర్లు కుప్పకూలాయి. మంగళవారం ఏకంగా 25 శాతం పడిపోయాయి. దీంతో ఈ ఒక్కరోజే సంస్థ మార్కెట్ విలువ 70 బిలియన్ డాలర్ల (రూ.6.7 లక్షల కోట్లు)దాకా ఆవిరైపోయింది. గడిచిన 58 ఏండ్లలో ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికానికిగాను కంపెనీ ప్రకటించిన ఆర్థిక ఫలితాలు నిరుత్సాహకరంగా ఉండటమే ఈ భీకర నష్టాలకు కారణమని బ్లూంబర్గ్ నివేదిక చెప్తున్నది. 1911లో ప్రారంభమైన ఐబీఎం ఆదాయం.. జూన్‌తో ముగిసిన 3 నెలల్లో ఏమాత్రం అంచనాలను అందుకోకుండా కేవలం 1 శాతం పెరిగి 17.2 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. ఇది మదుపర్లను పెద్ద ఎత్తున అమ్మకాల దిశగా నడిపించిందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**మేం తప్పు చేశాం..**

'క్లయింట్ల ఆలోచనల్ని అంచనా వేయడంలో మేము తడబడ్డాం. మార్కెట్‌లో చోటుచేసుకున్న మార్పులపట్ల వేగంగా స్పందించలేకపోయాం' అంటూ ఐబీఎం చైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణ మదుపర్లకు రాసిన ఓ లేఖలో పేర్కొనడం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. 'జూన్ నెలలో కొన్ని వారాలు.. క్లయింట్లు తమ త్రైమాసిక మూలధన వ్యయాన్ని సర్వర్లు, స్టోరేజీ, మెమరీ చిప్‌ల కొనుగోలుకు మళ్లించడాన్ని మేము గమనించాం. ధరలు పెరుగవచ్చన్న అంచనాల నడుమ ఈ కొనుగోలుకు దిగారు. అయితే ఈ పరిణామాన్ని మేము ఊహించలేకపోయాం. చివరకు అదే ఐబీఎం ఆదాయానికి గండి కొట్టింది' అని అన్నారు. ఈ క్రమంలో అర్వింద్ వ్యాఖ్యలు సైతం మదుపర్లలో మున్ముందు ఐబీఎం వ్యాపార కార్యకలాపాలపై ఆందోళనల్ని రేకెత్తించాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇన్వెస్టర్లు భారీగా కంపెనీ షేర్లలో లాభాల స్వీకరణకు పెద్దపీట వేశారని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. మొత్తానికి కృత్రిమ మేధ (ఏఐ)కు నానాటికీ ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో ఐబీఎం నష్టాలు.. ఇప్పుడు ఇతర టెక్ కంపెనీల ఫలితాలపైనా అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. న్యూయార్క్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో ఐబీఎం షేర్ విలువ ప్రస్తుతం 220.80 డాలర్లుగా ఉన్నది.

## కియా నుంచి సైరోస్ ఈవీ..
## సింగిల్ చార్జింగ్‌తో 526 కిలోమీటర్లు

**న్యూఢిల్లీ,**

దక్షిణకొరియాకు చెందిన కార్ల సంస్థ కియా...దేశీయ మార్కెట్లోకి మరో ఈవీ మాడల్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే ఉన్న సైరోస్‌లోనే ఈవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా ప్రవేశపెట్టిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో గరిష్ఠంగా 526 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు 51.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 526 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనుండగా, 42 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 443 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నట్టు పేర్కొంది.కేవలం 39 నిమిషాల్లోనే 10 శాతం నుంచి 80 శాతంవరకు బ్యాటరీ రీచార్జికానున్నది. రూ.25 వేలు ముందస్తుగా చెల్లించి బుకింగ్ చేసుకోవచ్చునని కస్టమర్లకు సంస్థ సూచించింది. కేవలం 8.1 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు డిజిటల్ కీ, వర్చ్యువల్ ఇంజిన్ సౌండ్ సిస్టమ్, బ్యాటరీ హీటింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు కలుపుకొని 25కి పైగా భద్రత ఫీచర్లు, హిల్ స్టార్ట్ అసిస్ట్ కంట్రోల్, బ్రేక్ అసిస్ట్ సిస్టమ్, టైర్ ప్రెషరల్ మానిటరింగ్ సిస్టమ్ వంటి నూతన టెక్నాలజీతో తయారు చేసింది.



## లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**ముంబై,**

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్ షేర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు ఆశాజనకంగా ఉంటాయన్న అంచనాతో ఫెడరల్ రిజర్వు దూకుడుతో నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటం మదుపర్లలో విశ్వాసాన్ని పెంచింది. ఫలితంగా కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 130.49 పాయింట్లు లాభపడి 77,185.43 వద్ద స్థిరపడింది.మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 26.45 పాయింట్లు అందుకొని 24,078.50 వద్ద ముగిసింది. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడం విశేషం. ఈ సూచీల్లో ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎస్బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగియగా..పవర్ గ్రిడ్, ఎల్ అండ్ టీ, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయని, ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో చివర్లో కోలుకున్నాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



## కెప్టెన్సీకి నేను సిద్ధమే..
## లార్డ్స్ విజయం మరుపురానిది..!



లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు చరిత్రాత్మక విజయంలో భాగమైన స్మృతి మంధాన ( రాబోయే రోజుల్లో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. ప్రస్తుతం వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న మంధాన టీమిండియ సిద్ధంగా ఉన్నానని చెబుతోంది. లార్డ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాలతో మెరిసిన ఈ ఓపెనర్ టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో మీరు సారథ్యం వహించేందుకు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'నేను రెడీ' అని బదులిచ్చింది.భారత మహిళల జట్టు విజయాల్లో కీలకమవుతున్న స్మృతి మంధాన లార్డ్స్ టెస్టుతో మరోసారి తానెంత విలువైన క్రికెటరో చాటింది. ఇంగ్లండ్ బౌలర్లను ఉతికిస్తూ రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాల(83, 70)తో రెచ్చిపోయిన మంధాన.. వైస్ కెప్టెన్‌గా తన బాధ్యతను సమర్థంగా పోషించింది. ఇదే ఉత్సాహంతో అవకాశం రావాలేగానే కెప్టెన్‌గా రాణిస్తానని అంటోందీ ఓపెనర్. టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో లార్డ్స్ టెస్టు విజయంపై మాట్లాడిన మంధాన.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'అవును.. నేను రెడీ' అని చెప్పింది. 'ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల ఏకైక టెస్టు ఆడడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా మ్యాచ్ గెలుపొందడం ఇంకా ఆనందంగా ఉంది. చరిత్రాత్మక మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో భాగమవ్వడం నాకు చాలా ప్రత్యేకం.మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు టెస్టు క్రికెట్ ఆడాలని కలలు కన్నాం. లార్డ్స్‌లో టెస్టు మ్యాచ్ ఆడడం మరపురానిది' అని మంధాన తెలిపింది. పదేళ్లకు పైగా టీమిండియాలో కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్న మంధాన.. త్వరలోనే కెప్టెన్‌గా ప్రమోట్ అయ్యే అవకాశాలున్నాయి. ఎందుకుంటే ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ వయసు 37 ఏళ్లు దాటింది. మంధానకు 29 ఏళ్లు మాత్రమే.నిరుడు స్వదేశంలో వన్డే ప్రపంచకప్ ట్రోఫీని అందించిన హర్మన్‌ప్రీత్ చిరకాల నిరీక్షణకు తెరదించింది. లార్డ్స్ టెస్టులో చిరస్మరణీయ విజయంతో ఆమె కీర్తి మరింత పెరిగింది. అయితే.. వచ్చే టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్ నాటికి హర్మన్‌ప్రీత్ మూడు ఫార్మాట్లలో కొనసాగకపోవచ్చు.. అదే జరిగితే వైస్ కెప్టెన్సీ అనుభవమున్న మంధానకు బాధ్యతలు అప్పగించడం లాంఛనమే. ఇప్పటివరకూ 18 టీ20లు, నాలుగు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన మంధాన.. 15 విజయాలు సాధించింది.

## వరల్డ్‌కప్‌లో కీలక మార్పులు..
## సూపర్ సిరీస్, సూపర్ 7 రౌండ్లకు శ్రీకారం..!

వచ్చే ఏడాది జరుగనున్న పురుషుల వన్డే వరల్డ్‌కప్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి మరింత ఆసక్తికరంగా మార్చేసింది. 14 జట్లతో సూపర్ సిక్స్ దశ, సెమీ-ఫైనల్, ఫైనల్.. ఇలా కొనసాగాల్సిన మెగా ఈవెంట్‌లో కీలక మార్పులు చేసింది ఐసీసీ. తక్కువ ర్యాంకున్న జట్లను దృష్టిలో పెట్టుకొని సూపర్ సిరీస్‌కు రూపమిచ్చింది అత్యున్నత క్రికెట్ బోర్డు. అంతేకాదు.. సూపర్ 6కు బదులు సూపర్ 7 రౌండ్ తెరపైకి వచ్చింది. దాంతో.. పెద్దజట్లతో పోటీపడలేని పసికూనలకు కూడా ముందంజ వేసే అవకాశం లభించనుంది.పరుషుల వన్డే వరల్డ్‌కప్ 2027 ఫార్మాట్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది ఐసీసీ. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో 14 జట్లు పోటీపడనుండగా.. చిన్న జట్లకు అనుకూలంగా సరికొత్తగా 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' రౌండ్లను ప్రవేశపెట్టింది ఐసీసీ. అంటే.. పద్నాలుగు జట్లలో చివరి మూడు ర్యాంకులోని టీమ్‌లు సూపర్ సిరీస్ రౌండ్‌లో తలపడుతాయి. ఈ రౌండ్ ఫలితాల ఆధారంగా ఒక జట్టు గ్రూప్ దశను దాటుంతుంది. మిగతా రెండు టీమ్‌లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.



**సూపర్ 7 విషయానికొస్తే..**

వరల్డ్‌కప్ గ్రూప్ దశ తర్వాతి రౌండ్ (రెండోది)కు 12 జట్లు అర్హత సాధిస్తాయి. రెండో దశగా పేర్కొనే ఇందులో ఒక్కో గ్రూప్‌లో ఆరు జట్లు.. మొత్తం 30 మ్యాచులు ఉంటాయి. అయితే.. కొత్తగా ఐసీసీ ప్రవేశపెట్టిన సూపర్ 7 ప్రకారం ఏడు జట్లు నాకౌట్‌కు చేరుతాయి.


రౌండ్ రాబిన్ పద్ధతి అనంతరం రెండు గ్రూపుల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు.. రెండు గ్రూపుల్లో అత్యధిక పాయింట్లున్న జట్టు ఏడో జట్టుగా సూపర్ 7కు దూసుకెళ్తుంది. ఆపై.. ఈ ఏడింటిలో టాప్-4 జట్లు సెమీఫైనల్‌కు వెళ్తాయి. సెమీస్ దాటిన జట్లు టైటిల్ పోరులో అమీతుమీకి సిద్ధమవుతాయి. వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్ అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21వ తేదీ వరకు జరుగనుంది.

**ఐపీఎల్ తరహాలో**

టీ20 వరల్డ్‌కప్ సైతం ఐపీఎల్ తరహాలో అలరించనుంది. ఐదు గ్రూప్‌లు, సూపర్ 10, ఎలిమినేటర్ మ్యాచ్‌లతో ఆద్యంతం ఆసక్తిగా ఉండనుంది. గత ఎడిషన్‌లో నాలుగు గ్రూప్‌లు ఉండగా.. వచ్చే ఎడిషన్ నుంచి 20 జట్లు, ఐదు గ్రూప్‌లుగా టోర్నీ జరుగనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లోని రెండు జట్లు ముందంజ వేస్తాయి. సూపర్ 8 బదులు సూపర్ 10ను తీసుకొస్తున్న ఐసీసీ.. ఐదు చొప్పున రెండు గ్రూపులుగా విభజించనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్‌లోని రెండు.. నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఐపీఎల్ తరహాలో రెండు ఎలిమినేటర్లు ఉంటాయి.

# స్పోర్ట్స్


## ఆదివారం ముగింపు వేడుక..
## ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం..!



ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నందున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియం (చీవష జీవతీంవఎ)లో జరుగనున్న 'క్లోజింగ్ సెరెమొనీ'లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్(ుశీఎ జతీబఱంవ), ఇంటర్నెట్ సెన్సేషన్ 'ఐషోస్పీడీ' సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు.సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది.ఆస్కార్ అవార్డు విజేత, గాయని జెన్నిఫర్ హడ్సన్(జీవఅఅఱటవతీ ఎబసంశీఅ) అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించనుంది. ఆస్కార్ విజతే, అమెరికా నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాడు. రాబీ విలియమ్స్(ఇంగ్లిష్ గాయకుడు, గేయ రచయిత), లారా పాసిని(ఇటలీ పాప్ సింగర్), నికొలె షెర్జింజర్(అమెరికా గాయని)లు తమ గాత్రంతో ఫ్యాన్స్‌ను సంగీతసాగరంలో ఓలలాడించనున్నారు. ఇంటర్నెట్ సంచలనం యూట్యూబర్ ఐషోస్పీడ్ తన మార్క్ హావభావాలతో సందడి చేయనున్నాడు.'ముగింపు వేడుకల్లో సంగీతం, సంస్కృతి, ఫుట్‌బాల్ థీమ్‌తో టోర్నమెంట్ మొత్తాన్ని ప్రతిబింబిస్తామ'ని వరల్డ్‌కప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హీమో ష్లిర్గి వెల్లడించాడు. ఈ ముగింపు వేడుకల్లో మెరిసే తారలు, ప్రముఖుల జాబితాలో మరొకొందరు పేర్లు చేరే అవకాశముందని సమాచారం.

# జక్కనతో 14 నెలల ప్రయాణం..

-స్లో మోషన్ జంప్స్..
'వారణాసి' సీక్రెట్స్ లీక్ చేసిన ప్రియాంక!




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న భారీ విజువల్ వండర్ 'వారణాసి'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో, చిత్ర కథానాయిక ప్రియాంక చోప్రా చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రాజెక్ట్ కోసం గత 14 నెలలుగా పనిచేస్తున్నట్లు తెలిపిన ఆమె, రాజమౌళి ప్రతి సన్నివేశాన్ని ఎంతో క్లారిటీతో, పకడ్బందీగా తెరకెక్కిస్తారని కొనియాడారు. ఈ సినిమా కోసం తాను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ కూడా చేసినట్లు పేర్కొంటూ, అంతకు మించి వివరాలను మాత్రం ప్రస్తుతానికి వెల్లడించలేనని తెలిపారు. అయితే ప్రియాంక చేసిన ఈ స్లో మోషన్ జంప్స్ ఏ యాక్షన్ సీక్వెన్స్‌లో భాగం అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్లు దర్శకుడు రాజమౌళి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు అన్నపూర్ణ స్టూడియోస్‌లో వేసిన భారీ సెట్లలో ఆఖరి నిమిషం షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జక్కన బృందం వీలైనంత త్వరగా చిత్రీకరణను ముగించి, అంతర్జాతీయ స్థాయిలో సినిమాను ప్రమోట్ చేయడానికి పక్కా యాక్షన్ ప్లాన్‌తో సిద్ధమవుతోంది. కాగా, ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై సీనియర్ నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర'గా, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే శక్తివంతమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



కేతిక శర్మ అందాలు కెవ్వు కేక..

# ఓటీటీలోకి వచ్చేస్తోన్న క్రేజీ యాక్షన్ డ్రామా 'పళ్లిచట్టంబి'!




'పళ్లిచట్టంబి'.. ఈ పేరు వినగానే తెలుగు ఆడియన్స్‌కు ముందుగా స్ట్రైక్ అయింది 'పల్లీ చట్నీ'. అవును, ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పుడు తెలుగువాళ్లంతా ఇలాగే అవాక్కయ్యారు. ఏంటి.. తెలుగులో పెట్టడానికి నిర్మాతలకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా? అంటూ సోషల్ మీడియాలో మీమ్స్‌తో ఆటాడుకున్నారు. కానీ, కట్ చేస్తే.. కంటెంట్ ఉన్న సినిమాకి టైటిల్స్ అడ్డుకావని ఈ చిత్రం నిరూపించింది. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయాన్ని అందుకొని విమర్శకుల ప్రశంసలు సైతం సొంతం చేసుకుంది. ఇక థియేటర్లలో ఈ టైటిల్ వెరైటీని చూసి మిస్ అయిన వారి కోసం ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సోనీ లివ్' లో జులై 24 నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రాబోతోంది.సినిమా కథ విషయానికి వస్తే.. 1957 నాటి కేరళ భూసంస్కరణల బిల్లు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. చర్చి భూములను కాపాడటం కోసం 'పోతన్ క్రిస్టోఫర్' (టొవినో థామస్) అనే యువకుడిని చర్చి రక్షకుడిగా (చట్టంబి) నియమిస్తారు. అయితే, అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కా (కయాదు లోహర్)తో అతని ప్రేమాయణం ఎలా సాగింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను దర్శకుడు డిజో జోస్ ఆంటోని తెరకెక్కించారు.

# అప్పుడు తండ్రితో.. ఇప్పుడు కొడుకుతో..!

ఆ స్టార్ హీరో సినిమాలో నయన తార.?

సినిమా ఇండస్ట్రీలో 22ఏళ్లుగా తిరుగులేని స్టార్ డమ్ సొంతం చేసుకుంది లేడీ సూపర్ స్టార్ నయన తార. కెరీర్ బిగినింగ్లో ఈ అమ్మడు చిన్న చిన్న పాత్రలు సెకండ్ హీరోయిన్ రోల్స్ చేసింది. రజినీకాంత్ నటించిన చంద్రముఖి, సూర్యతో కలిసి గజినీ సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా నటించినా ఆతర్వాత మెయిన్ హీరోయిన్ గా మారి బ్లాక్ బస్టర్స్ అందుకుంటుంది. అంతే కాదు స్టార్ హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు, తమిళ్ హిందీ భాషల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది అందాల భామ. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతుంది. ప్రస్తుతం నయన్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్ గా రాణిస్తుంది.రీసెంట్ గా మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ హిట్ తో నయన్ పేరు మరోసారి టాలీవుడ్ లో మారుమ్రోగుతుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం నయన్ ఒక్కో సినిమాకు రూ.25 నుంచి రూ.30 కోట్లు పారితోషకం తీసుకుంటుందని తెలుస్తుంది..ఇప్పటివరకు ఏ హీరోయిన్ సైతం ఇంతగా పారితోషికం తీసుకోలేదని ఇండస్ట్రీ టాక్. ఇదిలా ఉంటే ఇప్పుడు నయన్ ఓ స్టార్ హీరో సినిమాలో నటిస్తుందని తెలుస్తుంది. ఆ హీరో ఎవరో కాదు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. సుకుమార్, చరణ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో నయనతార నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. రంగస్థలం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలిసి ఇప్పుడు ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ రాలేదు. కానీ ఇప్పుడు ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతారను రంగంలో దింపుతున్నారని తెలుస్తుంది. ఆమె ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. అలాగే చరణ్‌కు అక్కగా నటించే అవకాశం ఉందని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే క్లారిటీ వస్తుందేమో చూడాలి.






# బేబీ బంప్‌తో సమంత.. 'నేనెప్పుడూ కోరుకున్న క్షణమిది' అంటూ ఎమోషనల్!

టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు త్వరలోనే తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత తన మొదటి సంతానానికి జన్మనివ్వబోతున్నట్లు సమంత అధికారికంగా ప్రకటించారు. ఇటీవల ఆమె కథానాయికగా నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ సినిమా విజయోత్సవ వేడుకల్లో సమంత బేబీ బంప్‌తో మెరిసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా తన ప్రెగ్నెన్సీ వార్తలపై స్పందిస్తూ, మాతృత్వాన్ని అనుభవిస్తున్న ఈ క్షణాల గురించి సమంత ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడారు.ఈ సరికొత్త ప్రయాణం నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. నిజానికి నేను ఈ అద్భుతమైన క్షణం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. జీవితంలో మాతృత్వాన్ని అందుకోవాలనేది నా చిరకాల కల. అందుకే ఈ కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడానికి నా వంద శాతం శ్రమిస్తాను' అని ఒక ఇంటర్వ్యూలో సమంత పేర్కొన్నారు. ప్రతి పనిని ఎంతో ఇష్టపడి చేసే తనకు, ఇప్పుడు తనలో సరికొత్త శక్తి, ఆలోచనలు మొదలయ్యాయని.. భవిష్యత్తులో రాబోయే మధురమైన రోజులను ఆహ్వానించేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని చెప్పారు.

# జూలై 23నే 'జననాయగన్' విడుదల?

హింట్ ఇచ్చిన మేనేజర్!



తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ చివరి చిత్రంగా రాబోతున్న మోస్ట్ అవేటెడ్ పొలిటికల్ డ్రామా 'జననాయగన్' విడుదలపై ఎట్టకేలకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా జూలై 24న విడుదల కానుందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. అయితే అంతకంటే ఒక రోజు ముందుగానే జూలై 23న థియేటర్లలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు చిత్ర సహ నిర్మాత, విజయ్ వ్యక్తిగత మేనేజర్ జగదీష్ పళనిసామి సోషల్ మీడియా వేదికగా ఒక పెద్ద హింట్ ఇచ్చారు. ఈ సినిమా విడుదల తేదీపై ఆయన ఇచ్చిన హింట్‌తో దళపతి అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక అనౌన్స్‌మెంట్ పోస్టర్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు, ఫైనల్ కట్‌లో కొన్ని కీలకమైన కొత్త సీన్లను యాడ్ చేయడం వల్ల ఈ సినిమా ఇటీవల మళ్లీ రీ-సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యూ' సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, సినిమాపై ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. త్వరలోనే విడుదల కానున్న పవర్‌ఫుల్ ట్రైలర్ సినిమా అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com